“ మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

“ మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 1-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 152 Issue: 152

01 డిసెంబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:33 సూర్యాస్తమయం - సా. 5:36 తిథి ఏకాదశి సా. 6:55 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం రేవతి రా. 11:18 వరకు తరువాత అశ్విని యోగం వ్యతీపాత రా. 12:49౦ వరకు కరణం వనిజ ఉ. 8:18 వరకు విష్టి సా. 6:55 వరకు వర్జ్యం మ. 12:14 నుండి మ. 1:42 వరకు దుర్ముహూర్తం మ. 12:27 నుండి మ. 1:11 వరకు మ. 2:39 నుండి మ. 3:23 వరకు రాహుకాలం ఉ. 7:56 నుండి ఉ. 9:19 వరకు యమగండం ఉ. 10:42 నుండి మ. 12:05 వరకు గుళికాకాలం మ. 1:27 నుండి మ. 2:50 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:57 నుండి తె. 5:45 వరకు అమృత ఘడియలు రా. 9:03 నుండి రా. 10:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:27 వరకు గమనిక: “౦” అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## విరాట శకం

క్రికెట్‌లో ఓ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా టీమిండియా తురుపుముక్క విరాట్ కోహ్లీ నిలిచాడు. సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో.. 52వ సెంచరీ చేసి వన్డేల్లో సచిన్ (51) పేరిట ఉన్న రికార్డును బద్దలుకొట్టాడు.

(పూర్తి వివరాలు క్రీడావాణి పేజీలో..)

### క్యూర్.. ప్యూర్.. రేర్..

# 3 విభాగాలుగా తెలంగాణ వర్గీకరణ



## ఔటర్ లోపల కాలుష్యాన్ని 'క్యూర్' చేయాల్సిందే

**ఆర్ఆర్ఆర్ వరకు రెండో అర్బన్ రీజియన్‌గా 'ప్యూర్'**

**ఆవల నుంచి తెలంగాణ సరిహద్దు వరకు 'రేర్'**

**మీడియాతో వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి**

**అంతకుముందు రైజింగ్ 2047 డాక్యుమెంట్‌పై సమీక్ష**

రాష్ట్ర భవిష్యత్తు కోసం 'తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్' రూపొందిస్తున్నామని.. అందులో భాగంగానే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్.. అంటూ మూడు భాగాలుగా విభజించామని సీఎం రేవంత్ తెలిపారు. అంతకుముందు ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు , ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తమ ప్రభుత్వం ప్రజా పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ పాలసీ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 30 (ఈవార్తలు): ఈ డాక్యుమెంట్‌కు 'రైజింగ్ 2047'గా నామకరణం చేశామని ఆయన చెప్పారు. ఈ ప్రణాళికలో సహకరించిన ప్రతి ఒక్కరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. గతాన్ని అనుభవంగా తీసుకుని, ఆ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూనే భవిష్యత్‌కు అడుగులు వేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాలసీలలో పెరాల్సిస్ వస్తే రాష్ట్ర భవిష్యత్ తీవ్రంగా నష్టపోతుందని ఆయన హెచ్చరించారు. ఈ పాలసీ డాక్యుమెంట్ తయారీలో భాగంగా, తాము ఐఎస్‌బీ (ISB), నీతి ఆయోగ్ వంటి ప్రముఖ సంస్థల సలహాలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. విజన్‌లో భాగమే స్ట్రాటజీ అని, ఆ స్ట్రాటజీలో భాగంగానే తెలంగాణను మూడు ప్రధాన ఆర్థిక విభాగాలుగా వర్గీకరించామని సీఎం వివరించారు.

**మూడు భాగాలివే..**

క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ): ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం అంతా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా పరిగణించబడుతుందని సీఎం తెలిపారు. గతంలో ఔటర్ లోపలి ప్రాంతంలో ఉన్న నాలుగు విభాగాల గందరగోళం తొలగిపోతుందని, కాలుష్య రహిత నగరంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని 'క్యూర్' చేయాల్సిందేనని వివరించారు.

ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ): ఔటర్ రింగ్ రోడ్డు బయటి నుండి ఆర్ఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు. 360 కి.మీ. పొడవైన ఆర్ఆర్ఆర్‌కు కేంద్రం అంగీకారం తెలిపిందని, ఇది నగరానికి రెండో అర్బన్ రీజియన్‌గా మారుతుందని అన్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలతో పాటు, బుల్లెట్ ట్రైన్ వేయడానికి కేంద్రం నుండి అనుమతి తెచ్చామని, హైదరాబాద్-బెంగుళూరు మధ్య కనెక్టివిటీని పెంచి అభివృద్ధిని సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

రేర్ (రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ): ఆర్ఆర్ఆర్ బయటి నుండి తెలంగాణ సరిహద్దు వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తరువాయి 2 వ పేజీలో...

### స్కామ్.. స్కీమ్.. గేమ్..

# హెచ్ఐఎల్‌టీపీ దేశ చరిత్రలోనే పెద్ద 'స్కామ్'



## డబ్బులు దండుకోవడానికే లోపభూయిష్ట 'స్కీమ్'

**రాష్ట్రంలో జరుగుతున్న కుంభకోణం మీకు తెలుసా?**

**లేక రేవంత్-మీరు కలిసి 'గేమ్' ఆడుతున్నారా?**

**రాహుల్ గాంధీకి కేటీఆర్ బహిరంగ లేఖాస్త్రం**


భారీ అవినీతికి తెరలేపి భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణానికి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నాడని తీవ్ర ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన లేఖ రాశారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ కుంభకోణం అని చెబుతూ దీనిపై చర్యలు తీసుకుంటారా? మౌనంగా ఉంటారా? అని ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ రాశారు. మౌనంగా ఉంటే మీ అంగీకారంతోనే ఈ కుంభకోణం జరిగిందని భావించినట్లు అవుతుందని పేర్కొన్నారు. 'ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెలుపలికి కాలుష్య పరిశ్రమలను తరలించాలనే లక్ష్యం పేరు చెప్పి తప్పుడు దారిలో రూ.లక్షల కోట్ల తెలంగాణ సంపదను దోచుకునేందుకు పక్కా ప్లాన్ కాంగ్రెస్ ప్రభుత్వం వేసింది' అని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు.

హైదరాబాద్, నవంబర్ 30 (ఈవార్తలు): 'పరిశ్రమల తరలింపు ప్రధాన లక్ష్యం అయితే ఇది మొత్తం పరిశ్రమలకు ఒక పాలసీ నిర్ణయంగా కాకుండా పూర్తి స్వచ్ఛందంగా నచ్చిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలనడం, ఒక్కొక్క దరఖాస్తు వారీగా ప్రత్యేకంగా ప్రభుత్వం భూముల ట్రాన్స్ఫర్ కి ఆమోదం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం, ప్రస్తుతం ఉన్న పరిశ్రమల తరలింపుకు ఎలాంటి గడవు నిర్ధారించకపోవడం, అసలు పరిశ్రమలు తరలి వెళ్తాయా లేదా అన్న అంశాన్ని ప్రకటించకపోవడం వంటి అనేక లోపభూయిష్టమైన పాలసీని కేవలం డబ్బులు దండుకోవడమే ఏకైక లక్ష్యంగా తీసుకువచ్చారు' అని లేఖలో కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. తరలించాలనుకునే పరిశ్రమలకు ప్రత్యామ్నాయ స్థలాలను ఈ విధానం గుర్తించలేదని, ఈ భూముల బదిలీతో కలిగి ఆవరణ ప్రభావాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం వంటి లోపాలు పాలసీలో ఉన్నాయని లేఖలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. దీనివల్ల హైదరాబాద్‌లో కొత్త పారిశ్రామికాభివృద్ధికి బదులుగా పాత పారిశ్రామిక యూనిట్ల స్థానంలో ఆకాశహర్మ్యాలు, వాణిజ్య సముదాయాలు పెరిగే అవకాశం ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'కొద్దిమంది కాంగ్రెస్ నాయకులు, పలుకుబడి ఉన్న రియల్ ఎస్టేట్ గ్రూపులు, రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తలు, కుటుంబసభ్యుల కు ప్రయోజనం చేకూర్చేలా హిల్ట్ పాలసీ రూపొందించారు' అని రాహుల్ గాంధీకి లేఖలో కేటీఆర్ వివరించారు. వీరందరికీ నామమాత్రపు ధరకి రాజధాని హైదరాబాద్‌లోని అత్యంత విలువైన భూములను పొందడానికి రూపొందించిన పాలసీ అని ఆరోపించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దలు అవినీతి కోసం డబ్బుల కట్టల కోసం తీసుకువచ్చిన ఈ పాలసీ ముమ్మాటికి తెలంగాణ ప్రజల నమ్మకాన్ని ద్రోహం తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,982 |
| వెండి (గ్రాము): | రూ.192 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,753 |

### విశ్వవాణి



శిక్షాకాలం తగ్గించుకోవాలనుకునేవారికి బ్రెజిల్ ప్రభుత్వం గొప్ప ఆఫర్ ప్రకటించింది. ఖైదీలెవరైతే ఒక్కో పుస్తకాన్ని చదివి దానిపై రివ్యూ రాస్తారో, వారికి 4 రోజుల శిక్షాకాలాన్ని తగ్గిస్తామని తెలిపింది. అలా ఏటా 12 పుస్తకాలు చదవొచ్చు. అంటే.. 48 రోజుల శిక్షాకాలాన్ని వాళ్లు తగ్గించుకోవచ్చు. 2012లో ప్రారంభమైన ఈ పథకం అక్కడ గొప్పగా అమలవుతోంది.



# కోట్లలో ఆస్తి నష్టం

**కొండగట్టు గుట్ట కింద 25 షాపులు ఆహుతి.. ఓ బిడ్డ పెళ్లి కోసం దాచుకున్న 8 లక్షలు బుగ్గి**

**ఘటనాస్థలిలో కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యే పర్యటన.. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ**

మల్యాల, నవంబర్ 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు గుట్ట కింది షాపుల్లో అగ్ని ప్రమాద ఘటనలో రూ. కోట్లలో ఆస్తి నష్టం జరిగినట్లు తెలిసింది. త్వరలో మేడారం జాతర ఉన్న నేపథ్యంలో బొమ్మల షాపుల యజమానులు పెద్ద ఎత్తున సామగ్రి కొని ఉంచారు. అవి కూడా కాలి బూడిదయ్యాయి. ప్రతి దుకాణంలో దాదాపు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విలువైన సామగ్రి ఆహుతైంది. ఓ కుటుంబం తమ బిడ్డ పెళ్లి కోసం రూ.8 లక్షలు దాచుకోగా, పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఆ తరువాయి 2 వ పేజీలో...

# నవంబర్ సూపర్ హిట్

## భారత క్రీడారంగానికి గొప్ప నెల

**మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ.. క్రీడల్లో మహిళల పైచేయిపై సంతోషం**



న్యూఢిల్లీ: భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, “భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు తరువాయి 2 వ పేజీలో...



# ఐతారం గోలె నెత్తుటి ధారలు

**రెండు ప్రమాదాల్లో 19 మంది దుర్మరణం..**

**తమిళనాడులో రెండు బస్సులు ఢీ.. 11 మంది మృతి**


**రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం 8 మంది మృత్యువాత**

చెన్నై/ జైపూర్: ఆదివారం వేళ రోడ్లపై రక్తం ఏరులై పారింది. రెండు చోట్ల జరిగిన భారీ ప్రమాదాల్లో 19 మంది దుర్మరణం చెందారు. వివరాల్లోకెళితే.. తమిళనాడులోని శివగంగ జిల్లా తిరుపత్తూరు సమీపంలో ఆదివారం రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో కనీసం 11 మృతి చెందగా, 40 మందికిపైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఒక బస్సు కరైకుడి వైపు వెళుతుండగా, మరొకటి మధురై వైపు వెళుతుండగా తరువాయి 2 వ పేజీలో...



## నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ: సోమవారం నుంచి పార్లమెంటుశీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదివారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కేంద్రం విపక్షాలను కోరింది. సమావేశాల్లో 10 కీలకమైన బిల్లుల్ని కేంద్రం సభల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.



## తాయిలాల తైలం వదలాలి

**దేశాన్ని నిర్మించేందుకు పనికిరావు**

**రేవ్డీ బాధ తెలుగు రాష్ట్రాలకు తెలుస్తోంది**

**ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు**

న్యూఢిల్లీ: ఉచిత పథకాలు ఎన్నికల్లో పార్టీలను గెలిపించినా, దేశాన్ని మాత్రం నిర్మించలేవని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. తాజాగా ఓ జాతీయ మీడియాకు రాసిన వ్యాసంలో ఆయన ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ఉచిత హామీలు, అలాగే -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

1.12.2025

మేషం: బంధు మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆర్థికంగా అభివృద్ధి కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో నూతన ఉత్సహంతో ముందుకు సాగుతారు. కుటుంబ విషయాలలో సొంత ఆలోచనలు చెయ్యడం మంచిది. సోదరుల సహాయంతో చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు.

వృషభం: కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన గృహ నిర్మాణ ఆలోచనలు మందగిస్తాయి. ముఖ్యమైన పనులు అనుకున్న సమయానికి పూర్తికాక నిరాశ కలిగిస్తాయి. ధన వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి.

మిథునం: వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆకస్మిక విజయం సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

కర్కాటకం: సన్నిహితుల ప్రోద్బలంతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాలపై దృష్టి సారిస్తారు. సోదరుల నుంచి శుభవార్తలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పనులు సకాలంలో పూర్తిచేసి అధికారుల ఆదరణ పొందుతారు.

సింహం: ఉద్యోగులకు అధికారుల నుండి ఆశించిన సహాయ సహకారాలు అందుతాయి. బంధు మిత్రులతో ఉన్న సమస్యలు తొలగుతాయి. వృత్తి, వ్యాపారాల విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఇతరులకు ధన సహాయం అందిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

కన్య: చేపట్టిన పనులలో తొందరపాటు మంచిది కాదు. మిత్రులతో కొన్ని విషయాలలో విభేదిస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది ఇంటా బయట బాధ్యతలు కొంత చికాకు కలిగిస్తాయి. ప్రయాణాలలో కొంత లాభం ఉన్నప్పటికీ శారీరక శ్రమ తప్పదు.

తుల: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దూరప్రాంత బంధువుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. పాత ఋణాలు కొంత వరకు తీర్చగలుగుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. సంఘంలో పెద్దల నుండి అరుదైన గౌరవ మర్యాదలు పొందుతారు.

వృశ్చికం: గృహమున సన్నిహితులతో ఆనందంగా గడుపుతారు. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు.

ధనస్సు: వ్యాపారాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకోవడం మంచిది. ఆర్థికంగా ఇబ్బందులున్నప్పటికీ అవసరాలకు ధనం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు.

మకరం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. స్థిరస్తి కొనుగోలు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఉద్యోగాలలో స్థానచలనాలు తప్పవు. కుటుంబ సభ్యులతో సఖ్యత కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో సన్నిహితుల నుండి ఆర్థిక సహాయం పొందుతారు.

కుంభం: వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి సాధిస్తారు. నూతన వ్యవహారాలకు శ్రీకారం చుడతారు. బంధుమిత్రులతో కలసి విహారయాత్రలలో పాల్గొంటారు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు అందుతాయి. దైవ సేవా కార్యక్రమాలకు చురుకుగా పాల్గొంటారు.

మీనం: ఇతరుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమ మరింత పెరుగుతుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థికంగా సమస్యలు తప్పవు. కుటుంబ సభ్యులతో సన్నిహితంగా మెలుగుతారు. ఆరోగ్య సమస్యలు బాధించిన అధిగమించి ధైర్యంగా ముందుకు సాగుతారు.

# దేశ చరిత్రలోనే పెద్ద 'స్కామ్'



మొదటి పేజీ తరువాయి

చేయడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిబంధనలు తొలగించి రేవంత్ రెడ్డి తెలంగాణను కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీ నాయకుల అనుచరులకు ఏటీఎంగా మార్చేశారు' అని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా సంపదను దోచుకోవడానికి ఈ పాలసీని రూపొందించారని కేటీఆర్ ఆరోపించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి కేటీఆర్ రెండు కీలక ప్రశ్నలు సంధించారు. పెద్దఎత్తున జరుగుతున్న అక్రమాల గురించి ఇప్పటివరకు తెలియకుంటే కనీసం ఇప్పుడైనా తెలంగాణలో జరుగుతున్న రూ.5 లక్షల కోట్ల అవినీతి కుంభకోణాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే దేశ చరిత్రలోనే అతిపెద్ద భారీ భూ కుంభకోణంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉంటే తనకు తన పార్టీకి భాగస్వామ్యం ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అనుమతితోనే 5 లక్షల కోట్ల భూకుంభకోణం తెలంగాణలో జరుగుతున్నదని భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఈ అంశంలో ఇప్పటికైనా మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ భారీ అవినీతికి అడ్డుకట్ట వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి తన అవినీతి కోసం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతామంటే ఒప్పుకునేది లేదని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని చెప్పారు. తను రాస్తున్న ఈ బహిరంగ లేఖకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చే సమాధానం తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా ఉంటుందా లేదా? ప్రజల ఆస్తులను దోచుకుంటున్న తమ పార్టీ నాయకులకు అండగా నిలబడేలా మౌనం మాత్రమే సమాధానంగా వస్తుందా? అన్నది ప్రజలు గమనిస్తారు' అని లేఖలో పేర్కొన్నారు.



# కోట్లలో ఆస్తి నష్టం

మొదటి పేజీ తరువాయి

కుటుంబ సభ్యుల బాధ వర్ణణాతీతంగా మారింది. కాగా, బాధిత కుటుంబాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తదితరులు పరామర్శించారు. బాధితులకు తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు, మహిళా సంఘాల ద్వారా వడ్డీ లేని రూ.5 లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. బాధితులను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. సోమవారం నుంచి రేకుల షెడ్ల పునర్నిర్మాణం, విద్యుత్తు కనెక్షన్ల పునరుద్ధరణ చేపట్టనున్నారు.

# తెలంగాణ వర్గీకరణ

మొదటి పేజీ తరువాయి

అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు.

**ఆదాయం-సంక్షేమం, విద్యా వ్యవస్థ ప్రక్షాళన:**

'ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి' అనేది తమ ప్రభుత్వ విధానమని సీఎం స్పష్టం చేశారు. మనకు ఫుడ్ సమస్య లేకపోయినా, పోషకాహార (న్యూట్రీషియన్) సమస్య ఉందని, దాన్ని ఎలా పరిష్కారం చేయాలనే దానిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ గ్రామాలకు చేరినప్పటికీ, ఇప్పుడు నాణ్యమైన విద్య, సాంకేతిక విద్య అందించడంపై దృష్టి పెట్టామని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణను 'నాలెడ్జ్ హబ్'గా మారిస్తే, పెట్టుబడులు, కంపెనీలు క్యూ కడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఎయిర్‌పోర్టుల విస్తరణలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో కొత్త ఎయిర్‌పోర్టులు తెస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

# కోట్లలో ఆస్తి నష్టం

మొదటి పేజీ తరువాయి

కుటుంబ సభ్యుల బాధ వర్ణణాతీతంగా మారింది. కాగా, బాధిత కుటుంబాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తదితరులు పరామర్శించారు. బాధితులకు తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు, మహిళా సంఘాల ద్వారా వడ్డీ లేని రూ.5 లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. బాధితులను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. సోమవారం నుంచి రేకుల షెడ్ల పునర్నిర్మాణం, విద్యుత్తు కనెక్షన్ల పునరుద్ధరణ చేపట్టనున్నారు.

# ఐతారం గోలె నెత్తుటి ధారలు



మొదటి పేజీ తరువాయి

తిరుపత్తూరు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఘోర ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో అనేక మంది ప్రయాణికులు బస్సుల్లో చిక్కుకుపోయారని, స్థానికులు, అత్యవసర బృందాలు వారిని బయటకు తీశాయని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొనడంతో 11 మంది మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారని పేర్కొన్నారు. కారైకుడికి 15 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో 8 మంది మహిళలు, ఇద్దరు పురుషులు, ఒక చిన్నారి సహా 11 మంది అక్కడికక్కడే మృతి చెందారని జిల్లా పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ ప్రయాణికులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు అధికారులు మాట్లాడారు. 'ఇది ముఖాముఖి ఢీకొనడం కారణమా అని స్పష్టంగా తెలియదు. మేం దానిని పరిశీలిస్తు న్నాం.' అని చెప్పారు. గాయపడిన వారిని శివగంగై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు. ఇందులో కొంతమంది ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కూడా చెప్పారు. అటు.. రాజస్థా న్‌లోని జైపూర్ సమీపంలో గల దౌసా-మనోహర్‌పూర్ ఎన్‌హెచ్-148 జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 8 మంది దుర్మరణం చెందారు. జమ్వారామ్‌గఢ్ పరిధిలో జరిగిన ఈ ప్రమాదం అధిక వేగం ఓవర్‌టేక్ ప్రయత్నం కారణంగా జరిగింది. వేగంగా వస్తున్న ఒక కారు నియంత్రణ కోల్పోయి నేరుగా నిలిపి ఉన్న ట్రైలర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న 8 మంది వ్యక్తులు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై రహదారి భద్రత ప్రమాణాలపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. ప్రాథమిక దర్యాప్తులో అతి వేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు నిర్ధారించారు. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. గాయాలు తీవ్రంగా ఉండటంతో వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఈ ఎన్‌హెచ్-148 రహదారి గతంలో కూడా అనేక ఘోర ప్రమాదాలకు కారణమైంది. ఈ మార్గంలో 12 కిలోమీటర్ల పరిధిలోనే దాదాపు 8 ప్రమాదాప్రవణ ప్రదేశాలు (బ్లాక్ స్పాట్‌లు) ఉన్నట్లు గుర్తించారు. ఉదాహరణకు, గతంలో ఆగస్టు 13, 2025 న ఇదే దౌసాలో జరిగిన పికప్ వ్యాన్-ట్రక్ ప్రమాదంలో 11 మంది మరణించారు. వారిలో ఏడుగురు పిల్లలు ఉన్నారు. ఈ వరుస ప్రమాదాలు ఈ రహదారిపై మరమ్మత్తు పనులు ట్రాఫిక్ నియంత్రణ కఠినతరం చేయవలసిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. రహదారి భద్రత పెంచాలని నిపుణులు పోలీసులకు సూచిస్తున్నారు. రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఈ ఘటనతో మరింత పెరిగింది.



# తాయిలాల తైలం వదలాలి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇచ్చిన ఉచిత పథకాలు అమలు చేసే విషయంలో పడుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. హామీలపై ఎన్నికైన ప్రభుత్వాలు ఇప్పుడు వాటిని నెరవేర్చడంలో ఇబ్బంది పడుతుండటం లోతైన సమస్య అని ఆయన హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన సంక్షేమ నిర్మాణం ఊహించిన దానికంటే చాలా ఖరీదైనది అనే విషయాన్ని ఇప్పుడు నేర్చుకుంటోందన్నారు. ఇక తెలంగాణ సంవత్సరాల తరబడి పెద్ద ఎత్తున ఉచిత పథకాలు/ఆర్థిక సహాయం అందిస్తూ ఫిస్కల్ హ్యాంగోవర్ (ప్రభుత్వాలు విపరీతమైన వ్యయాలు చేసిన తర్వాత ఎదుర్కొనే ఆర్థిక సమస్యలు) పరిస్థితితో పోరాడుతోందన్నారు. సామాజిక బదిలీలను పెంచడం వల్ల ఇతర విచక్షణా ఖర్చులకు తక్కువ స్థలం ఉందని మహారాష్ట్ర కర్ణాటక గ్రహించాయని ఆయన అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు సామాజిక బదిలలను పెంచడం వల్ల ఇతర స్వచ్ఛంద వ్యయాలకు స్పేస్ తగ్గుతోందని గ్రహిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో రాజకీయాల్లో రేవ్డీ (ఉచితాలు) సంస్కృతిని ఖండించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వాటి శక్తిని చూసిన తర్వాత తాను కూడా ఉచితాల సంస్కృతి స్వీకరించినట్లు కనిపిస్తోందని సుబ్బారావు గుర్తు చేశారు. ఇది పక్షపాత వైఫల్యం కాదని నిర్మాణాత్మక రాజకీయ సమస్య అని పేర్కొన్నారు. ఏ పార్టీ కూడా ఉచిత పోటీలో వెనుకబడి ఉండటానికి ఇష్టపడవన్నారు. ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లి ఎన్నికలను ప్రస్తావిస్తూ.. పార్టీలు నగదు వాగ్దానాలతో ఒకదానితో మరొకటి పోటీ పడ్డాయని గుర్తు చేశారు. పాలక ఎన్డీఏ దాదాపు 1.2 కోట్ల మంది మహిళలకు రూ. 10 వేలు బదిలీ చేస్తే ప్రతిపక్ష మహాఘట్ బంధన్ కూటమి రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఏడాదికి రూ. 30,000, ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం హామీ ఇచ్చిందన్నారు. మన ఆర్థిక రాజకీయాల్లో నిజాయితీ మరియు జవాబుదారీతనాన్ని పునరుద్ధరించాల్సిన సమయం వచ్చిందని అందువల్ల పార్టీలు ఇచ్చే ఉచిత పథ కాలకు ఎంత ఖర్చు అవుతుంది వాటిని ఎక్కడి నుంచి సేకరిస్తారు? ఎప్పటి వరకు అమలు చేస్తారు అనే జాతీయ ప్రవర్తనా నియమావళిని రూపొందించాలని పిలుపునిచ్చారు.

# నవంబర్ సూపర్ హిట్

మొదటి పేజీ తరువాయి

కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు. అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీ-ఫైనల్‌లో ఇరాన్‌పై 33%-%21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35%-%28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. "మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని కొనియాడారు.



# ప్రియుడి మృతదేహాన్ని పెళ్లాడిన యువతి

### మహారాష్ట్ర నాందేడ్‌లో యువకుడి హత్య

### ప్రేమించాడని యువతి కుటుంబం ఘాతుకం

### మృతదేహంతోనే పెళ్లి చేసుకున్న ప్రియురాలు

నాందేడ్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఒక పరువు హత్య తీవ్ర కలకలం రేపింది. తమ కూతురిని ప్రేమిస్తున్నాడన్న కారణంతో ఓ యువకుడిని ఆమె కుటుంబ సభ్యులే అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ప్రియుడి అంత్యక్రియల వద్దకు చేరుకున్న ఆ యువతి, అతని మృతదేహాన్ని పెళ్లాడి, ఇకపై అతని కుటుంబంతోనే కోడలిగా ఉంటానని శపథం చేయడం అందరినీ కదిలించింది. వివరాల్లోకి వెళితే.. నాందేడ్‌కు చెందిన సాక్షం టేటే (20), ఆంచల్ అనే యువతి గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. తన సోదరుల ద్వారా పరిచయమైన సాక్షంతో ఆంచల్‌కు సాన్నిహిత్యం పెరిగింది. అయితే వేర్వేరు కులాలు కావడంతో ఆంచల్ కుటుంబ సభ్యులు వారి పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు. సంబంధం మానుకోవాలని అనేకసార్లు బెదిరించారు. అయినప్పటికీ వారు తమ ప్రేమను వదులుకోలేదు. సాక్షంను పెళ్లి చేసుకోవాలని ఆంచల్ నిర్ణయించుకున్న విషయం తెలియడంతో ఆమె తండ్రి, సోదరులు గురువారం అతనిపై దాడి చేశారు. సాక్షంను తీవ్రంగా కొట్టి, తలపై తుపాకీతో కాల్చి, అనంతరం బండరాయితో తల నుజ్జునుజ్జు చేసి కిరాతకంగా హత్య చేశారు. సాక్షం అంత్యక్రియలు జరుగుతుండగా ఆంచల్ అక్కడికి చేరుకుంది. అతని మృతదేహానికి పసుపు రాసి, తన నుదుట సిందూరం దిద్దుకుంది. చనిపోయినా తన ప్రియుడినే భర్తగా స్వీకరించింది. జీవితాంతం సాక్షం ఇంట్లోనే అతని భార్యగా, వారి కోడలిగా ఉండిపోతానని నిర్ణయించుకుంది. "సాక్షం మరణంలో కూడా మా ప్రేమే గెలిచింది. మా నాన్న, సోదరులు ఓడిపోయారు. సాక్షం చనిపోయినా మా ప్రేమ బతికే ఉంది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నిందితులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, హత్యకు పాల్పడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఉప్పల్ స్టేడియంలో

# మెస్సీ మ్యాచ్

**అక్కడే తెలంగాణ విజన్ ఆవిష్కరణ.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**

### 13న హైదరాబాద్‌కు ఫుట్‌బాల్ దిగ్గజం






హైదరాబాద్, నవంబర్ 30 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ స్టార్ ఆటగాడు లియోనల్ మెస్సీ పర్యటిస్తాడని వెల్లడించారు. డిసెంబర్ 1 నుంచి ఉమ్మడి జిల్లాల్లో సంబరాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 1న మక్తల్, 2న కొత్తగూడెం, 3న హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న దేవరకొండలో ఉత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7న ఉస్మానియా వర్సిటీలో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేస్తారని భట్టి వెల్లడించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో గ్లోబల్ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. "రెండేళ్ల పాలనలో ఏం చేశామో డిసెంబర్ 8న సదస్సులో చెబుతాం. భవిష్యత్తులో ఏం చేయబోతున్నామో 9న వివరిస్తాం. ఆ రోజే విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. తెలంగాణ విజన్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరిస్తాం. గ్లోబల్ సమ్మిట్‌లో స్టాళ్లను ప్రజలు సందర్శించేలా చర్యలు తీసుకున్నాం. డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో ప్రజలకు అనుమతి ఇస్తాం. డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో మెస్సీ ఫుట్‌బాల్ ఆడతారు. తెలంగాణ విజన్‌ను ఉప్పల్ స్టేడియంలో ఆవిష్కరిస్తాం. జిల్లాల్లో జరిగే ఉత్సవాల్లో మంత్రులు పాల్గొంటారు" అని భట్టి విక్రమార్క వెల్లడించారు.

## 60 రోజుల ముందే

# టికెట్ బుకింగ్

**ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్**




హైదరాబాద్, నవంబర్ 30 (ఈవార్తలు): ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్సు ప్రయాణానికి 60 రోజుల ముందుగానే టికెట్లను రిజర్వేషన్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా పండుగలు, సెలవుల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని, ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే తమ ప్రయాణ ప్రణాళికలు వేసుకునేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. వాస్తవానికి ఈ 60 రోజుల ముందస్తు బుకింగ్ సదుపాయం గతంలోనూ అందుబాటులో ఉంది. అయితే దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో, పండుగల సీజన్ నేపథ్యంలో దీన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇటీవలి కాలంలో టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 'గమ్యం' యాప్ ద్వారా బస్సుల లైవ్ లొకేషన్ తెలుసుకునే సదుపాయం కల్పించింది. అంతేకాకుండా, పలు ప్రధాన రూట్లలో ఏసీ, సీటర్, స్లీపర్ వంటి కొత్త సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చింది. విమాన ప్రయాణం తరహాలోనే బస్సు బయలుదేరే సమయం, స్టాపుల వివరాలు వంటి సమాచారాన్ని ముందుగానే అందిస్తూ ప్రయాణాన్ని సులభతరం చేస్తోంది.



# జంపింగ్ పాలిటిక్స్ వద్దు!

**టీపీసీసీ చీఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు**

హైదరాబాద్,నవంబర్ 30 (ఈవార్తలు): జంపింగ్ పాలిటిక్స్‌తో (ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి) కొంతకాలమే బాగుంటుందని, కానీ దీర్ఘకాలంలో రాజకీయాల్లో కొనసాగాలనుకుంటే అది సరైన మార్గం కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న చాలామంది నేతలు గతంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లలో పనిచేసినవారేనని ఆయన గుర్తు చేశారు. ఈ సంస్థలలో పని చేస్తే కాంగ్రెస్ పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన సూచించారు. శనివారం గాంధీ భవన్ ప్రాంగణంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, యూత్ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని, గ్రామాలలో పనిచేస్తే ప్రజల నాడి తెలుస్తుందని అన్నారు. యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన నాయకులు కార్పొరేషన్ ఛైర్మన్‌లుగా, డీసీసీ అధ్యక్షులుగా ఎదిగారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఇలాంటి అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. యూత్ కాంగ్రెస్‌కు గొప్ప భవిష్యత్తు ఉందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ కూడా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లను ఎంతగానో అభిమానిస్తారని ఆయన తెలిపారు. యువతకు మరింత మంచి అవకాశాలు లభించాలని ఆయన ఆకాంక్షించారు. కష్టపడి పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని, రాబోయే రోజుల్లో యువతకు ఉన్నత పదవులు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# నిర్లక్ష్యం వల్లే భారీ నష్టం

**కొండగట్టు ప్రమాదంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి**

**బాధిత కుటుంబాలకు 30 లక్షలు**

**సాయం చేయాలని డిమాండ్**



మల్యాల, నవంబర్ 30 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే భారీ ఆస్తి నష్టం జరిగిందని ఆరోపించారు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో సుమారు 30 దుకాణాలు పూర్తిగా కాలిపోయి, దాదాపు కోటి రూపాయల ఆస్తి నష్టం జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం అప్పులు చేసి దుకాణాలు పెట్టుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడ్డాయని విచారం వ్యక్తం చేశారు. అగ్నిమాపక శకటాలు సకాలంలో ఘటనా స్థలానికి చేరుకోకపోవడమే నష్టం పెరగడానికి ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. జగిత్యాల ఫైరింజన్ మరమ్మతులో ఉండటం, వచ్చిన మరో ఇంజన్ పనిచేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సాయం అందించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కేటీఆర్ అభినందించారు. నష్టపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించకపోతే, పార్టీ తరఫున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## విద్యుత్తు షాక్‌తో

# రైతు మృతి

ఖానాపూర్, నవంబర్ 30 (ఈవార్తలు): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుర్జాపూర్ గ్రామానికి చెందిన రైతు పన్నెల వెంకట్రాములు (54) తన సొంత ఐదెకరాల వ్యవసాయ భూమిలో మూడు ఎకరాల వరి సాగు చేయగా.. రెండు ఎకరాల మక్కా పంటను సాగు చేస్తున్నాడు. శనివారం రాత్రి మక్క పంటకు నీరు పెట్టడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆదివారం ఉదయం బంధువులు తన మిత్రులతో కలిసి వెళ్లి చూడగా వ్యవసాయ బావి వద్ద కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. మృతుడికి భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. కుమారుడు నిషిత్ ప్రైవేట్ కంపెనీలు పని చేస్తుండగా.. కూతురు నిషితకు వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అయ్యప్ప దీక్షలో ఉండి ఆకస్మాతుగా మృతి చెందడంతో గ్రామస్తులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు.

# బీఆర్ఎస్‌దే స్థానిక గెలుపు

**సత్యవతి రాథోడ్**

డోర్నకల్, నవంబర్ 30 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఆదివారం ఆమె మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. మహలక్ష్మి పథకం రూ.2,500, రైతు భరోసా రూ.15వేలు, కల్యాణలక్ష్మి తులం బంగారం, రెట్టింపు పింఛన్ల ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఎన్నికల కోసమే మహిళలకు చీరెలు పంపిణీ చేశారని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లాలో ఒక్క సీటు కూడా బీసీలకు రాలేదన్నారు. ఎమ్మెల్యేలు రాంచంద్రూనాయక్, మురళీ నాయక్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను ఏవిధంగా ఓటు అడుగుతారో చెప్పాలన్నారు. చుట్టం చూపులా నియోజకవర్గానికి వచ్చే ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ డోర్నకల్ నియోజకవర్గం గురించి ఏం తెలుసన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు కేసీఆర్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి డోర్నకల్ ప్రజలకు అభివృద్ధి పథకాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, మాజీ సర్పంచ్ బానోత్ పాండూనాయక్, బీఆర్ఎస్ నాయకులు మాన్యుపాట్నీ, కాలా యశోధర్ జైన్, రాంభద్రం, రఘు, చంటి, శ్రీనివాస్, హూన్యానాయక్ పాల్గొన్నారు.

# ముళ్ల పొదల్లో నవజాత శిశువు

**కాపాడిన అంబులెన్స్ సిబ్బంది**

నారాయణపేట, నవంబర్ 30 (ఈవార్తలు): నారాయణపేట జిల్లాలో దారుణం జరిగింది. అప్పుడే పుట్టిన నవజాత ఆడ శిశువును తల్లిదండ్రులు ముళ్ల పొదల్లో పడేసి మానవత్వాన్ని మంటగలిపారు. అటుగా వెళ్తున్న స్థానికులు శిశువు ఏడుపు విని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది పరీక్షించి వైద్యం అందించి రక్షించి బాధ్యతను నెరవేర్చారు. నారాయణపేట మండలం అప్పక్ పల్లి గ్రామం కాటన్ మిల్ సమీపంలో ముళ్లపొదల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఆడశిశువును వదిలేసి వెళ్లారు. స్థానికులు చిన్నారి ఏడుపులు విని అంబులెన్స్‌కు సమాచారం అందజేయడంతో హుటాహుటిన వారు అక్కడికి చేరుకొని, ఆ నవజాత శిశువును కాపాడారు. స్వల్ప గాయాలతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న శిశువును గమనించిన అంబులెన్స్ టెక్నీషియన్స్ శిరీష ప్రథమ చికిత్స చేసి నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహేందర్ శిశువును పరీక్షించి, ప్రస్తుతం శిశువు ఆరోగ్యం మెరుగ్గానే ఉందని వెల్లడించారు.

# లారీ ప్రైవేటు బస్సు ఢీ- ఇద్దరు మృతి

బోథ్, నవంబర్ 30 (ఈవార్తలు): ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నేరేడిగొండ మండలం బోథ్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటనలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి యూపీలోని గోరఖ్‌పూర్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలు

**స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీలను నిలదీయాలి**

**ప్రజలకు మాజీమంత్రి హరీశ్ రావు పిలుపు**

హైదరాబాద్, నవంబర్ 30 (ఈవార్తలు): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలూ తోడు దొంగలని, వారి మధ్య 'గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ' నడుస్తోందని ఆయన ఆరోపించారు. కల్వకుర్తికి చెందిన పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్లో ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా హరీశ్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజలకు బాకీ పడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను 'మా బాకీ పైసలు ఎప్పుడు ఇస్తారు?' అని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ, తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తేలేకపోయారని విమర్శించారు. పక్క రాష్ట్రాలకు కేంద్రం వేల కోట్లు కేటాయిస్తుంటే, తెలంగాణకు మాత్రం మొండిచెయ్యి చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కళకళలాడిన హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల వెలవెలబోతున్నాయని, రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేశారని దుయ్యబట్టారు. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను ప్రజలు నిలదీయాలని ఆయన కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## టేకులపల్లిలో

# 200 కిలోల గంజాయి పట్టివేత

టేకులపల్లి, నవంబర్ 30 (ఈవార్తలు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. టేకులపల్లి మండలంలోని సాయన్నపేట క్రాస్ రోడ్డు సమీపంలో మూల మలుపు వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా టేకులపల్లి పోలిసులు రూ.99లక్షల 83వేల గల 199.673కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్యాకెట్ల రూపంలో కారు డిక్కీలో పెట్టి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇల్లందు డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయిని కొనుగోలు చేసి ఆంధ్ర %-% ఒడిషా బార్డర్ నుండి రాజస్థాన్‌కు తరలిస్తుండగా శనివారం టేకులపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లాల్ సింగ్ చౌహాన్‌ని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని తెలిపారు. లాల్ సింగ్ చౌహాన్ పై ఇదివరకు మూడు కేసులు ఉన్నాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్ఐ ఆలకుంట రాజేందర్, బోడ్ ఎస్ఐ పి. శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 3న జర్నలిస్టుల సమస్యలపై మహాధర్నా

**టీయుడబ్ల్యూజే (ఐజేయూ) కరపత్రాల ఆవిష్కరణ**

హనుమకొండ, నవంబర్ 30 (ఈవార్తలు): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయుడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో డిసెంబర్ 3న మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 3న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు నినాదాలు చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం తాత్సారధోరణి అవలంభిస్తూ కాలయాపన చేస్తున్నదన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నదని, ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు 3న హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ రాష్ట్రసమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మహాధర్నా నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్‌మోహన్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సహాయ కార్యదర్శి పొడిశెట్టి విష్ణువర్ధన్, సీనియర్ నాయకులు సీహెచ్ సోమనర్సయ్య, ఎం.రాజేంద్రప్రసాద్, అనుముల రవి, దేవేందర్, ఎండి ఉస్మాన్ పాషా పాల్గొన్నారు.

# అణచివేత ఉంటే జిహాద్ ఉంటుంది

**మౌలానా మదానీ సంచలన వ్యాఖ్యలు**

**దేశంలో కొత్త జిన్నాలు పుట్టుకొస్తున్నారన్న బీజేపీ**

న్యూఢిల్లీ: జమియత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా మహమూద్ మదానీ చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. అణచివేత ఉంటే జిహాద్ ఉంటుందంటూ ఆయన చేసిన ప్రకటనపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. రాజ్యాంగ సంస్థలను సవాలు చేస్తూ ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. మైనారిటీల రాజ్యాంగ హక్కులను కాపాడటంలో న్యాయవ్యవస్థ విఫలమైందని మదానీ ఆరోపించారు. బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాక్ వంటి కేసుల్లో ప్రభుత్వ ఒత్తిడితోనే కోర్టులు తీర్పులు ఇస్తున్నాయని ఆయన విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడలేనప్పుడు సుప్రీంకోర్టును 'సుప్రీం' అని పిలవడానికి కూడా అర్హత లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'లవ్ జిహాద్', 'ల్యాండ్ జిహాద్' వంటి పదాలతో పవిత్రమైన జిహాద్‌ను వక్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మదానీ వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే రామేశ్వర్ శర్మ తీవ్రంగా స్పందించారు. దేశంలో కొత్త జిన్నాలు పుట్టుకొస్తున్నారని, ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మదానీపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మదానీ లాంటి వాళ్లే టెర్రరిస్టులను, జిహాదీలను తయారు చేస్తారని, దేశంలో అశాంతి సృష్టించే వారిని సుప్రీంకోర్టు ఉరితీస్తుందని శర్మ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, హద్దుల్లో ఉండాలని ఆయన హెచ్చరించారు.

# జగిత్యాల జిల్లా అడవుల్లో పుష్ప



## రెచ్చిపోయిన కలప స్మగ్లర్లు.. సారంగాపూర్ - రేచపల్లి అడవుల్లో వనమేధం

## సుమారు 1500 చెట్లు నరికిన స్మగ్లర్లు.. వాటి విలువ రూ.2 కోట్లపైనే!

జగిత్యాల టౌన్, నవంబర్ 30 (ఈవార్తలు): జగిత్యాల ఫారెస్ట్ రేంజ్‌లో పుష్ప సినిమాను తలదన్నే దృశ్యాలు కనిపిస్తున్నాయి. సారంగాపూర్-రేచపల్లి అడవుల్లో కలప స్మగ్లర్లు వనమేధం సృష్టించారు. దాదాపు 1,500 చెట్లను నరికేశారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం.. వాటి విలువ రూ.2 కోట్లపైనే ఉంటుందని అంచనా. పర్యావరణానికి భారీగా నష్టం వాటిల్లింది. ఆ లెక్కన చూస్తే రూ.110 కోట్ల పర్యావరణ నష్టం కలిగింది. ఈ వనమేధంలో అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అందినట్లు తెలిసింది. దాదాపు రూ.50 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం. అందుకే.. కలప స్మగ్లర్లు రెచ్చిపోతున్నా ఫారెస్ట్ అధికారులు మొద్దు నిద్రలో తూలుతున్నారు. ఇటీవల నలుగురు బీట్, గార్డ్ స్థాయి అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్న అటవీశాఖ.. అక్రమ రవాణాను మాత్రం అడ్డుకోలేకపోతోంది. బాసర-నిర్మల్ జోన్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలో, జగిత్యాల ఫారెస్ట్ రేంజ్‌లో కలప స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతోంది. మొత్తంగా ఈ అటవీ విస్తీర్ణం 5000 ఎకరాలు ఉంటుంది. కలపనే కాకుండా, వన్యప్రాణులను కరెంట్ షాక్‌తో వేటాడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, విజిలెన్స్ విచారణ చేపట్టాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.



## రేవంత్ ఫుట్‌బాల్ ప్రాక్టీస్

**హైదరాబాద్, నవంబర్ 30 (ఈవార్తలు): ఈ నెల 13న ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆ రోజు ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్‌లో రేవంత్, మెస్సీ పాల్గొననున్నారు. రెండు జట్లకు వీళ్లు కెప్టెన్లుగా వ్యవహరించబోతున్నట్లు సమాచారం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి సీఎం రేవంత్ పలువురు ఆటగాళ్లతో కలిసి ప్రాక్టీస్ చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి.**

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

జగిత్యాల టౌన్, నవంబర్ 30 (ఈవార్తలు): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రజల నుండి వినతులను స్వీకరించబోమని వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని ప్రజలు గమనించాలని, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని స్పష్టం చేశారు. కోడ్ అనంతరం కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# స్కాంల కాంగ్రెస్



## విద్యుత్తు పాలసీ బూటకం.. కమీషన్ల కోసం అర్రులు

## మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్.. రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజం

జగిత్యాల టౌన్, నవంబర్ 30 (ఈవార్తలు): దేశంలోనే అతిపెద్ద భూస్కాంకు తెరలేపిన కాంగ్రెస్ సర్కారు దుర్బుద్ధిని బయటపెట్టామని, తాజాగా మరో రూ.50 వేల కోట్ల పవర్ స్కాం వెలుగు చూసిందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దాదాపు 30-40% కమీషన్లు దండుకోబోతున్నరని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న స్కాంలను ఎండగడుతున్న హరీశ్ రావు దిష్టి బొమ్మ దహనం చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొప్పుల ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'పవర్ ప్లాంట్ లకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకంగా కాదు. కాంగ్రెస్ సర్కారు తెచ్చిన విద్యుత్తు పాలసీ పచ్చి బూటకం.. చెప్పేదొకటి చేసేది మరొకటి. ఒక మెగావాట్ కాస్ట్ యాదాద్రికి రూ.8.63 కోట్లు, భద్రాద్రికి రూ.9.74 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఎన్టీపీసీ కూడా ఒక మెగావాట్‌కు రూ.12.23 కోట్లు వెచ్చించింది. రేవంత్ సర్కారు నిర్మించబోయే రామగుండం పవర్‌ప్లాంట్ కాస్ట్ పర్ మెగావాట్ రూ.14 కోట్లు అని అంచనా వేశారని, ఇది ఇంతటితో ఆగదని కాస్ట్ మరింత పెరుగుతుంది. కానీ, రామగుండం దగ్గర రేవంత్ సర్కారు ప్రతిపాదించిన ప్రాజెక్టుకు మెగావాట్‌కు 14 కోట్లు. ఇది కూడా ఇనిషియల్ కాస్ట్ అని, రామగుండం దగ్గర ఎఫ్‌జీడీ పొల్యూషన్ కంట్రోల్ సిస్టమ్ లేదు. అయినా రూ.14 కోట్లు పెట్టారంటే కాస్ట్ డబుల్ అయ్యింది. యాద్రాద్రి పవర్‌ప్లాంట్‌ను మేం రూ.7.5 కోట్లతో నిర్మిస్తే.. మీరు రామగుండాన్ని రూ.14 కోట్లు చేశారు. అది పూర్తయ్యేవరకు రూ.16 కోట్లు అవుతుంది. ఒక్కో మెగావాట్‌కు రూ.7 కోట్లు అధికంగా పెట్టారు. 800 మెగావాట్లు అంటే ప్రతి మెగావాట్‌కు రూ.ఏడు కోట్లు అంటే మొత్తం రూ.5,600 కోట్లు. రామగుండంలో రూ.5,600 కోట్లు, పాల్వంచలో రూ.5,600 కోట్లు, మక్తల్‌లో రూ.5,600 కోట్లు ఇలా మొత్తం రూ.15-20 వేల కోట్లు ధరలు పెంచి బడా స్కాంకు పాల్పడుతున్నారు. రేవంత్ రెడ్డి నాడు యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులు మేము కడుతుంటే అవి దండుగా, కట్టనే కట్టవద్దని అన్నడు. ఇప్పుడు ముద్దు అంటున్నాడు. తక్కువ ధరకే కరెంట్ వస్తుంటే ఎక్కువ ఉత్పత్తి రేటుతో ప్లాంట్లు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీపీసీ తక్కువ ధరకే 2,400 మెగావాట్ల కరెంట్ ఇస్తానని చెప్పింది నిజమా..? కాదా..? రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన కొత్తలో మార్కెట్లో రూ.5కే యూనిట్ విద్యుత్ లభిస్తుందని చెప్పారు, ఇప్పుడు యూనిట్ విద్యుత్తు కోసం రూ.10కి పైగా వెచ్చిస్తున్నారు ఇదంతా కమీషన్ కోసం కాదా? ప్రతిపాదిత రామగుండం ప్లాంట్ డీపీఆర్ ప్రకారం యూనిట్‌కు రూ.7.92 ఖర్చు చేయబోతున్నరు. ప్రాజెక్టు పూర్తి కావడానికి నాలుగైదు ఏండ్లు పడుతుంది. అదనంగా పెరిగే ఇతర వ్యయాలు కలుపుకుంటే ప్లాంటు నిర్మాణ వ్యయం రూ.10,880 కోట్ల నుంచి రూ.14-15 వేల కోట్లకు పెరుగుతుంది. కరెంట్ యూనిట్ కాస్ట్ రూ.7.92 నుంచి 9,10 రూపాయలకు పెరుగుతుందని అంచనా, నాడు 4 నుంచి 5 కాస్ట్‌తో విద్యుత్తు కొనుగోలు చేయొచ్చు అన్న రేవంత్‌రెడ్డి నేడు రూ.10 ఒక యూనిట్ కోసం ఖర్చు చేస్తానంటున్నాడు. రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లు పెడతమని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నరు. రామగుండం ప్లాంట్ విషయంలో ఎన్టీపీసీ, జెన్‌కోకు అవకాశం కల్పిస్తామన్నారు. ఎవరు తక్కువ రేట్‌కు కోట్‌చేస్తే, తక్కువ ధరకు కరెంట్ ఇస్తే వారికే ఇస్తానన్నారు. ఇదంతా పెద్ద డ్రామా.! దీనిపై ఎన్టీపీసీ, జెన్‌కోలు రెండు డీపీఆర్‌లు తయారు చేశాయి. ప్లాంట్లు కట్టించి ఇచ్చేందుకు ఎన్టీపీసీ కాంట్రాక్ట్ సంస్థ కాదు. ఇతరుల కోసం ప్లాంట్లను నిర్మించదు. ఈ ప్లాంట్ కోసం క్యాబినెట్‌కు సమర్పించిన జెన్‌కో డీపీఆర్ ప్రకారం ఒక మెగావాట్‌కు రూ.14 కోట్లు ఖర్చవుతుందని చెప్పింది. మొదట రూ.17 కోట్లు చెప్పి.. బద్నాం అవుతామని రూ.14 కోట్లకు తగ్గించారు. ఆ తర్వాత అంచనాలు పెంచే స్కెచ్.. స్కామ్ కూడా దీని వెనుకున్నది. తెలంగాణ కోసమే రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఎన్టీపీసీ 4వేల మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను కడుతున్నది. 1600 మెగావాట్ల ప్లాంట్ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే కట్టింది. ఈ పవర్‌ను తెలంగాణ తీసుకున్నది కూడా. ఇప్పుడు మరో 2,400 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ కడుతున్నది. ఎలాంటి అప్పు చేయకుండా రూ.4.12కే యూనిట్ విద్యుత్తు సరఫరా చేస్తామని ఎన్టీపీసీ చెప్తుంటే ఎందుకు వద్దంటున్నారు. ఎన్టీపీసీని తిరసరించడం వెనుక మతలబు ఏమిటి? ఇది స్కామ్ కాకపోతే మరేమిటి?' అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, ఉప్పుగండ్ల నరేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అటు.. బుగ్గారం మండలానికి చెందిన కొందరు బీజేపీ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. మండలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పోలంపల్లి మల్లేశం, భారతపు గంగాధర్ తదితరులు మాజీమంత్రి కొప్పుల సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.



## 'ఐబొమ్మ'లో నేనూ సినిమాలు చూశా

**సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు**

తిరుపతి, నవంబర్ 30 (ఈవార్తలు): సీపీఐ అగ్రనేత కె.నారాయణ 'ఐబొమ్మ' వెబ్‌సైట్ వ్యవహారంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐబొమ్మ రవిని శిక్షించడం కంటే అసలైన సినిమా మాఫియాను ఉరితీయాలని, అప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. తాను కూడా ఐబొమ్మలో ఉచితంగా సినిమాలు చూశానని ఈ సందర్భంగా నారాయణ వెల్లడించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టికెట్ ధరలను రూ.600-700కు పెంచితే సామాన్యులు సినిమాలు ఎలా చూస్తారని ఆయన ప్రశ్నించారు. "కోట్లు ఖర్చుపెట్టి, టికెట్ ధరల కోసం అడుక్కుంటారు. సామాన్య ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం సాయం చేస్తుందా? కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వారిని ఐబొమ్మ రవి దెబ్బకొట్టారు" అని నారాయణ వ్యాఖ్యానించారు. ఒకరిని జైల్లో వేయడం వల్ల ప్రయోజనం లేదని, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని సూచించారు. వ్యవస్థలోని లోపాలను సరిచేయనంత కాలం ఇలాంటి వ్యక్తులు పుట్టుకొస్తూనే ఉంటారని నారాయణ హెచ్చరించారు. "ఒక ఐబొమ్మ రవిని జైలులో వేస్తే మరో వంద మంది వస్తారు. అదే విధంగా, మావోయిస్టు నేత హిడ్మాను చంపడం ద్వారా వెయ్యి మంది హిడ్మాలు పుడతారు" అని అన్నారు. వ్యవస్థాగత వైఫల్యాల వల్లే రవి లాంటి వారు తప్పుడు మార్గంలోకి వెళుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యక్తులను శిక్షించడం సమస్యకు పరిష్కారం కాదని, అసలు సమస్య వ్యవస్థలోనే ఉందని నారాయణ స్పష్టం చేశారు. ఈ వ్యవస్థే ఐబొమ్మ రవి లాంటి వ్యక్తులను సృష్టిస్తోందని, లోపాలను సరిదిద్దకపోతే భవిష్యత్తులోనూ ఇలాంటి వారు వస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

# ఏపీ హక్కుల కోసం పోరాడండి

## వైసీపీ ఎంపీలకు జగన్ పిలుపు



తాడేపల్లి, నవంబర్ 30 (ఈవార్తలు): ఏపీలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంతో పాటు, ఆంధ్రప్రదేశ్ హక్కుల సాధన కోసం పార్లమెంటులో గట్టిగా పోరాడాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీలతో సమావేశమయ్యారు. తుఫాను నష్టంతో పాటు, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్ పీ) లభించకపోవడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ అంశాలపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. 'మొంథా' తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, సర్వం కోల్పోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయని జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా నేరుగా పంటలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందని, ఇప్పుడు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో రైతులు దళారుల చేతుల్లో నలిగిపోతున్నారని ఆవేదన చెందారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కంది, అరటి, మిర్చి, మామిడి వంటి అన్ని ప్రధాన పంటలకు మద్దతు ధర పడిపోయిందని, దీనివల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించి, రైతులకు తక్షణమే అత్యవసర సహాయ నిధులతో పాటు, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేలా ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అందించామని, ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేయడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ విమర్శించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందడం లేదని, ఈ-క్రాప్ నమోదును నిలిపివేయడంతో పరిహారం పొందేందుకు కూడా రైతులు అనర్హులుగా మారుతున్నారని అన్నారు. మిర్చి రైతులకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పి మోసం చేశారని, మామిడి రైతులను కూడా ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. ఇదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా 18.63 లక్షలతో సహా మొత్తం లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులను రద్దు చేయడంపై జగన్ మండిపడ్డారు. దీనివల్ల గ్రామీణ కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని, వెంటనే అర్హులైన వారి కార్డులను పునరుద్ధరించి, పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేయాలని ఎంపీలకు సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ముక్కలు చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, వేలాది మంది కార్మికుల జీవితాలను కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజకీయ కక్ష సాధింపులు పెరిగిపోయాయని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపించారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, ఉపాధి కల్పన, హక్కుల పరిరక్షణ కోసం పార్లమెంటు వేదికగా గట్టిగా పోరాడాలని జగన్ తన ఎంపీలకు స్పష్టం చేశారు.

# ఏపీలోనూ 'సర్' చేపట్టాలి

**లావు శ్రీకృష్ణ దేవరాయలు వినతి**



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే తరహాలో ఏపీలోనూ ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, ఆదివారం ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో ప్రభుత్వం అన్ని పార్టీలను కోరింది. అయితే, ఇదే సమావేశంలో ప్రతిపక్షాలు ఓటర్ల జాబితా సవరణపై ఉన్న ఆందోళనలపై పార్లమెంటులో చర్చ జరగాలని పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో ఎన్డీయే మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ తరఫున లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. ఏపీలో ఓటర్ల జాబితా సవరణ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అఖిలపక్ష సమావేశంలో తాము పలు కీలక అంశాలను లేవనెత్తినట్లు తెలిపారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ అంశంపై ఈ సమావేశాల్లో సమగ్ర చర్చ జరగాలని కోరినట్టు వివరించారు. ఈ వివాదం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్ జీవన్ మిషన్ గురించి కూడా ప్రస్తావించినట్లు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఈ పథకం అమలు విధానం, దాని ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చేకూరే ప్రయోజనాలపై స్పష్టత కోసం పార్లమెంటులో చర్చ జరపాలని కోరినట్లు చెప్పారు. దీనివల్ల పథకం అమలులో పారదర్శకత వస్తుందని, రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలు పూర్తిగా అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.



# బలహీనపడిన 'దిత్వా'

## అయినా ఏపీకి భారీ వర్ష సూచన

**నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు**

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరిక**

నెల్లూరు, నవంబర్ 30 (ఈవార్తలు): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను తీవ్రవాయుగుండంగా బలహీనపడింది. శ్రీలంక తీరాన్ని తాకిన అనంతరం ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ బలహీనపడినట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. అయితే, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, గత 6 గంటల్లో తుపాను గంటకు 5 కిలోమీటర్ల వేగంతో కదులుతూ బలహీనపడిందని తెలిపారు. సోమవారం ఉదయానికి ఇది మరింత బలహీనపడి సాధారణ వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను ప్రభావంతో సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు గట్టిగా హెచ్చరించారు. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. మరోవైపు, తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో శ్రీవారి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రభుత్వ యంత్రాంగం సూచించింది. ఎన్డీఆర్ఎఫ్, పోలీసు బృందాలను సిద్ధంగా ఉంచారు.

**టెలికం శాఖ ప్రత్యేక చర్యలు**

దిత్వా తుఫాను నేపథ్యంలో కేంద్ర టెలికం శాఖ ముందస్తుగా అప్రమత్తమైంది. తుఫాను సమయంలో టెలికాం నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 24/7 పనిచేసేలా ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. టెలికం సర్వీస్ ప్రొవైడర్లతో సమన్వయం చేసుకుంటూ, జిల్లా యంత్రాంగాలు, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థలకు తక్షణ సమాచారం అందించనుంది. అన్ని టెలికం కంపెనీలు తమ సేవలను నిరంతరాయంగా కొనసాగించాలని, జనరేటర్లకు అవసరమైన ఇంధనాన్ని, అత్యవసర పవర్ బ్యాకప్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని డాట్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

**ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో సరెండర్**

**వీరిలో 27 మందిపై రూ. 65 లక్షల రివార్డు**



బస్తర్/దంతెవాడ: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దంతెవాడ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'లోన్ వర్రాటు', 'పూనా మర్గం' (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) పథకాలకు ఆకర్షితులై 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని లొంగిపోయిన మావోయిస్టులు పేర్కొన్నారు. దంతెవాడలోని డీఆర్‌జీ కార్యాలయంలో పోలీసు, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారుల సమక్షంలో వీరు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. "మా నిరంతర ప్రయత్నాలు, స్థానిక ప్రజల మద్దతు ఫలించాయి. అడవుల్లో జీవించడం కష్టంగా మారిందని, పోలీసులు అన్ని ప్రాంతాలకు చేరుకుంటున్నారని, గ్రామస్తుల నుంచి కూడా మద్దతు లభించడం లేదని లొంగిపోయిన వారు చెబుతున్నారు" అని వివరించారు. లొంగిపోయిన వారిలో కొందరు సీనియర్ మావోయిస్టు కమాండర్లకు బాడీగార్డులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం లొంగిపోయిన వారికి రూ. 50,000 ఆర్థిక సాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి వంటి అదనపు ప్రయోజనాలు అందిస్తారు. గత 20 నెలల్లో దంతెవాడ జిల్లాలో 165 మంది రివార్డు ఉన్న మావోయిస్టులతో సహా మొత్తం 508 మంది లొంగిపోయారని అధికారులు తెలిపారు. ఈ పరిణామం హింసారహిత బస్తర్ దిశగా వేసిన మరో కీలక అడుగు అని వారు అభివర్ణించారు.

## కాలిఫోర్నియాలో కాల్పులు.. నలుగురు మృతి

స్టాక్టన్: అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం చోటుచేసుకుంది. కాలిఫోర్నియా రాష్ట్రంలోని స్టాక్ టన్ నగరంలో శనివారం రాత్రి కొందరు దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. స్థానికంగా ఉన్న ఓ బాంక్వెట్ హాల్ లో పుట్టిన రోజు వేడుకలు జరుగుతుండగా ఒక్కసారిగా చొరబడ్డ దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు శాన్ జోక్విన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో నలుగురు మరణించగా, పది మందికి బుల్లెట్ గాయాలయ్యాయని పేర్కొంది. దుండగుల కాల్పుల్లో గాయపడిన వారిలో పలువురు చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపింది. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నామని, బాధితులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

## ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారు: పీటీఐ



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరణించారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) తీవ్రంగా ఖండించింది. ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారని, రావల్పిండిలోని అదియాలా జైలులో క్షేమంగా ఉన్నారని పీటీఐ సెనేటర్ ఖుర్రం జీషన్ స్పష్టం చేశారు. ఇమ్రాన్‌ను దేశం విడిచి వెళ్లేలా ఒత్తిడి చేసేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడిన జీషన్, "ఇమ్రాన్ ఖాన్ జనాదరణ చూసి ప్రస్తుత ప్రభుత్వం భయపడుతోంది. అందుకే ఆయన ఫొటోలు గానీ, వీడియోలు గానీ బయటకు రాకుండా జాగ్రత్త పడుతోంది. గత కొన్ని రోజులుగా ఆయన బతికే ఉన్నారని, జైలులో క్షేమంగా ఉన్నారని మాకు హామీ లభించింది" అని తెలిపారు. ఇటీవల ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన కొన్ని సోషల్ మీడియా ఖాతాల నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను జైలులో హత్య చేశారంటూ వార్తలు వ్యాపించాయి. గత నెల రోజులుగా కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఇమ్రాన్ ఖాన్‌ను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులను కూడా అధికారులు అనుమతించడం లేదని జీషన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఇది పూర్తిగా మానవ హక్కుల ఉల్లంఘన. దేశం విడిచి వెళ్లి, నిశ్శబ్దంగా ఉంటే కొన్ని రాయితీలు ఇస్తామని ప్రభుత్వం ఆయనతో ఒప్పందం చేసుకోవాలని చూస్తోంది. కానీ ఇమ్రాన్ ఖాన్ అలాంటి వాటికి ఎప్పటికీ అంగీకరించరు" అని ఆయన అన్నారు. జైలులో ఉన్నప్పటికీ ఇమ్రాన్ ప్రభావం ఏమాత్రం తగ్గలేదని, యువతలో ఆయనకు బలమైన మద్దతు ఉందని జీషన్ పేర్కొన్నారు.

## విషమంగా ఖలీదా జియా హెల్త్

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా (80) ఆరోగ్యం అత్యంత విషమంగా ఉంది. ప్రస్తుతం ఆమెను ఢాకాలోని ఓ ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ లక్షణాలతో నవంబర్ 23న ఆమె ఆసుపత్రిలో చేరారు. ఆమె త్వరగా కోలుకోవాలని దేశ ప్రజలు ప్రార్థనలు చేయాలని కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు విజ్ఞప్తి చేశారు. తాజాగా బీఎన్‌పీ నేత అహ్మద్ ఆజం ఖాన్ ఆసుపత్రి వెలుపల మీడియాతో మాట్లాడుతూ, "ఖలీదా జియా ఐసీయూలో ఉన్నారు. వైద్యుల బృందం ఆమెను నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఆమె పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది" అని తెలిపారు. ఆమె ఆరోగ్యం కాస్త స్థిరపడితే, మెరుగైన వైద్యం కోసం విదేశాలకు తరలించేందుకు ఎయిర్ అంబులెన్స్‌ను కూడా సిద్ధంగా ఉంచినట్లు ఆయన వివరించారు. ఈ వార్త తెలియగానే పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకుంటున్నారు. ఖలీదా జియా చాలాకాలంగా గుండె, కాలేయం, కిడ్నీ సమస్యలతో పాటు డయాబెటిస్, ఊపిరితిత్తుల వ్యాధులు, ఆర్థరైటిస్ వంటి పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆమెకు శాశ్వత పేస్‌మేకర్ అమర్చారు. లండన్‌లో ఉంటున్న ఆమె పెద్ద కుమారుడు తారిఖ్ రెహమాన్, తన తల్లి త్వరగా కోలుకోవాలని బంగ్లాదేశ్ ప్రజలు ప్రార్థించాలని సోషల్ మీడియా ద్వారా కోరారు. కొన్ని అనివార్య కారణాల వల్ల తాను స్వదేశానికి రాలేకపోతున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. షేక్ హసీనా ప్రభుత్వ హయాంలో 2018లో అవినీతి ఆరోపణలపై ఖలీదా జియా జైలుకు వెళ్లారు. గత ఏడాది హసీనా అధికారం కోల్పోయిన తర్వాత ఆమె విడుదలయ్యారు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ, 2026 ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తానని ఆమె ఇప్పటికే ప్రకటించారు.

## 3.37 కోట్ల మంది డేటా చోరీ

**కూపాంగ్‌లో అతిపెద్ద డేటా బ్రీచ్**

న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం కూపాంగ్‌లో అతిపెద్ద డేటా బ్రీచ్ జరిగింది. దాదాపు 3.37 కోట్ల మంది వినియోగదారుల వ్యక్తిగత సమాచారం చోరీకి గురైనట్లు కంపెనీ స్వయంగా ధ్రువీకరించింది. ఈ సంఘటనతో కస్టమర్లలో తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలల పాటు ఈ డేటా చోరీ జరిగినట్లు తెలుస్తోంది. వినియోగదారుల పేర్లు, ఫోన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు, డెలివరీ అడ్రస్‌లు లీక్ అయినట్లు కంపెనీ వెల్లడించింది. అయితే, పేమెంట్ వివరాలు, క్రెడిట్ కార్డ్ నంబర్లు, లాగిన్ పాస్‌వర్డ్‌లు సురక్షితంగా ఉన్నాయని స్పష్టం చేసింది. జూన్ 24 నుంచే విదేశీ సర్వర్ల ద్వారా తమ కస్టమర్ల డెలివరీ సంబంధిత సమాచారాన్ని అనధికారికంగా యాక్సెస్ చేసినట్లు గుర్తించామని అని కూపాంగ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేసుపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ డేటా బ్రీచ్ వెనుక కంపెనీకి చెందిన ఒక మాజీ చైనా ఉద్యోగి హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అతను ప్రస్తుతం కంపెనీలో పనిచేయడం లేదని, ఇప్పటికే దేశం విడిచి వెళ్ళిపోయాడని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. నవంబర్ 18న ఈ ఉల్లంఘనను గుర్తించిన కూపాంగ్, రెండు రోజుల్లో అధికారులకు సమాచారం ఇచ్చింది. తొలుత కేవలం 4,500 మంది కస్టమర్ల డేటా మాత్రమే లీక్ అయినట్లు కంపెనీ నివేదించింది. అయితే, దర్యాప్తులో ఈ సంఖ్య కోట్లలో ఉందని తేలడంతో వినియోగదారులు తమ సమాచారం దుర్వినియోగం అవుతుందేమోనని భయపడుతున్నారు. గతంలో ఎస్‌కే టెలికాంకు చెందిన 2.32 కోట్ల మంది డేటా లీకైన ఘటనకు ప్రభుత్వం రికార్డు స్థాయిలో 13,480 కోట్ల వాన్ల జరిమానా విధించింది. ప్రస్తుత కూపాంగ్ ఉల్లంఘన దానిని మించి ఉండటంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



## రష్యా ట్యాంకర్‌పై దాడి మా పనే: ఉక్రెయిన్

కీవ్: నల్ల సముద్రంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. రష్యాకు చెందిన 'విరాట్' అనే ఆయిల్ ట్యాంకర్‌పై శనివారం మానవ రహిత సముద్ర వాహనం (అన్‌మ్యాన్డ్ సీ వెహికల్) దాడి చేసింది. శుక్రవారం రాత్రి కూడా ఇదే ట్యాంకర్‌పై దాడి జరగ్గా, ఇది రెండో ఘటన. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ (ఎస్‌బీయూ), నౌకాదళం సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు ఏఎఫ్పీ కథనం వెల్లడించింది. తమపై డ్రోన్ దాడి జరిగిందని, సహాయం కావాలని ట్యాంకర్ సిబ్బంది రేడియో ద్వారా అత్యవసర సందేశం పంపారు. ఆధునిక 'సీ బేబీ' నావల్ డ్రోన్లతో ఈ ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నామని, దాడికి సంబంధించిన వీడియో ఫుటేజీని కూడా ఉక్రెయిన్ వర్గాలు విడుదల చేశాయి. గాంబియా జెండాతో ప్రయాణిస్తున్న ఈ ట్యాంకర్లు, రష్యా 'షాడో ఫ్లీట్'లో భాగంగా పనిచేస్తున్నాయని తెలుస్తోంది. పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలను ఉల్లంఘించి ఈ ట్యాంకర్లు రష్యా నుంచి చమురును రవాణా చేస్తున్నాయి. ఈ షాడో ఫ్లీట్ ద్వారా వచ్చే ఆదాయంతోనే రష్యా యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటోందని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. ఈ దాడులతో రష్యా చమురు రవాణాకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఉక్రెయిన్ అధికారి ఒకరు తెలిపారు. దాడికి గురైన నౌకల్లో సుమారు 70 మిలియన్ డాలర్ల విలువైన చమురు ఉండవచ్చని 'ది కీవ్ ఇండిపెండెంట్' పేర్కొంది. ఈ దాడిలో 'విరాట్' ట్యాంకర్‌కు స్వల్ప నష్టం జరిగినప్పటికీ, ప్రస్తుతం దాని పరిస్థితి స్థిరంగానే ఉందని, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని టర్కీ రవాణా మంత్రిత్వ శాఖ వెల్లడించింది.



## సోనియా, రాహుల్‌పై క్రిమినల్ కుట్ర కేసు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి చిక్కులు మరింత పెరిగాయి. వీరిద్దరిపై క్రిమినల్ కుట్ర ఆరోపణలతో ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు, మూడు కంపెనీలను నిందితులుగా చేర్చారు. గాంధీలతో పాటు శామ్ పిట్రోడా, మరో ముగ్గురు వ్యక్తుల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. వీరితో పాటు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్), యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలపైనా కేసు నమోదైంది. నేషనల్ హెరాల్డ్ పత్రిక మాతృ సంస్థ అయిన ఏజేఎల్‌ను మోసపూరితంగా చేజిక్కించుకునేందుకు క్రిమినల్ కుట్ర పన్నారన్నది ప్రధాన ఆరోపణ. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అందించిన దర్యాప్తు నివేదిక ఆధారంగా అక్టోబర్ 3న ఈ ఎఫ్ఐఆర్ దాఖలైంది. కోల్‌కతాకు చెందిన డోటెక్స్ అనే షెల్ కంపెనీ నుంచి యంగ్ ఇండియన్ సంస్థకు రూ. కోటి అందిందని, ఈ నిధులతో కాంగ్రెస్ పార్టీకి రూ. 50 లక్షలు చెల్లించి, సుమారు రూ. 2,000 కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులను యంగ్ ఇండియన్ నియంత్రణలోకి తీసుకుందని ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. యంగ్ ఇండియన్‌లో సోనియా, రాహుల్ గాంధీలకు 76 శాతం వాటాలు ఉన్నాయి. 2012లో బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ కేసు మొదలైంది. అయితే, ఏజేఎల్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల రుణం ఇచ్చిందని, ఆ అప్పును తిరిగి చెల్లించలేకపోవడంతో దానిని ఈక్విటీగా మార్చి లాభాపేక్ష లేని సంస్థ అయిన యంగ్ ఇండియన్‌కు బదిలీ చేశామని కాంగ్రెస్ పార్టీ వాదిస్తోంది. ఈ కేసులో ఢిల్లీ కోర్టు తీర్పును డిసెంబర్ 16కు వాయిదా వేసిన మరుసటి రోజే ఈ కొత్త ఎఫ్ఐఆర్ విషయం వెలుగులోకి రావడం గమనార్హం.

# 10 మంది ట్రంప్‌లొచ్చినా ఏం చేయలేరు

**ఆఫ్ఘన్ ఇమిగ్రేషన్ బ్యాన్‌పై అమెరికా మాజీ సైనికుడు**



వాషింగ్టన్: వాషింగ్టన్ డీసీలో ఆఫ్ఘన్ మూలాలున్న వ్యక్తి జరిపిన కాల్పుల ఘటన అమెరికాలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఆఫ్ఘన్ వలసదారులపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. అయితే, ఒక వ్యక్తి చేసిన తప్పుకు యావత్ ఆఫ్ఘన్ సమాజాన్ని బలిపశువును చేయడం అన్యాయమని అమెరికా మాజీ సైనికుడు అహ్మద్ షా మోహిబి తీవ్రంగా వ్యతిరేకించారు. కాల్పుల ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే ట్రంప్ స్పందిస్తూ.. ఆఫ్ఘన్ జాతీయులకు గ్రీన్ కార్డుల జారీ ప్రక్రియను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఆఫ్ఘనిస్థాన్‌ను ఒక "నరక కూపం"గా అభివర్ణించారు. దీంతో పాటు ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్, ఇరాన్, వెనెజువెలా సహా 19 దేశాల నుంచి వచ్చిన వలసదారుల వివరాలపై విస్తృత సమీక్షకు ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ చర్యలను మోహిబి తప్పుబట్టారు. "ఒక వ్యక్తి తుపాకీతో దాడి చేసినంత మాత్రాన ఆఫ్ఘన్ ప్రజలంతా ఉగ్రవాదులు కాదు. అందరినీ శిక్షించడం సరికాదు" అని ఆయన అన్నారు. 2021లో అమెరికా సేనల ఉపసంహరణ సమయంలో నెలకొన్న గందరగోళ పరిస్థితులే ప్రస్తుత సమస్యలకు కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా వలసల విధానం పూర్తిగా విఫలమైందని... పది మంది ట్రంప్‌లు వచ్చినా ఈ సమస్యను పరిష్కరించలేరని ఆయన వ్యాఖ్యానించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, కాల్పులకు పాల్పడిన రహ్మానుల్లా లకన్‌వాల్.. స్పెషల్ ఇమ్మిగ్రెంట్ వీసా ప్రోగ్రామ్ కింద అమెరికాకు రాలేదు. తాలిబన్లు అధికారం చేపట్టాక, నాటి అధ్యక్షుడు జో బైడెన్ ప్రారంభించిన 'ఆపరేషన్ అలైస్ వెల్‌కమ్' కార్యక్రమం ద్వారా అమెరికా చేరుకున్నాడు. గతంలో సీఐఏతో కూడా పనిచేసిన లకన్‌వాల్, 2024లో శరణార్థి హోదా కోసం దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది ట్రంప్ పరిపాలనలోనే ఆమోదం లభించడం గమనార్హం. ఈ ఘటనను సాకుగా చూపి ప్రభుత్వం చాలాకాలంగా అమలు చేయాలనుకుంటున్న విధానాలను ముందుకు తెస్తోందని 'ఆఫ్ఘన్‌ఇవాక్' అధ్యక్షుడు షాన్ వాన్‌డైవర్ ఆరోపించారు. అమెరికా వలసల విధానంలోని వైఫల్యం ఏ ఒక్క అధ్యక్షుడిదో కాదని, ఇది దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యవస్థాగత లోపమని విశ్లేషకులు అంటున్నారు.

# కుంభమేళా కోసం 1,800 చెట్ల నరికివేత!

**'మహా' ప్రభుత్వంపై నటుడు సాయాజీ షిండే ఆగ్రహం**



ముంబై: నాసిక్‌లో 2027లో జరగనున్న కుంభమేళా ఏర్పాట్ల కోసం గోదావరి నది ఒడ్డున సుమారు 1,825 చెట్లను నరికివేయాలన్న ప్రభుత్వ నిర్ణయం తీవ్ర వివాదానికి దారితీసింది. పర్యావరణవేత్తలు, స్థానిక పౌరులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. స్థానికంగా మొదలైన ఈ ఉద్యమానికి ప్రముఖ నటుడు, పర్యావరణ ప్రేమికుడు సాయాజీ షిండే మద్దతు పలకడంతో ఇది మరింత విస్తృతమైంది. 2027 కుంభమేళా కోసం మహారాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 3,700 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సాధువులు, సంతుల బస కోసం తపోవన్ ప్రాంతంలో 'సాధుగ్రామ్' నిర్మించనున్నారు. దీని కోసమే పాత, దృఢమైన దేశీయ వృక్షాలను తొలగించాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. ఈ పనులను ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కుంభమేళాకు దీటుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ నిర్ణయంపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. శుక్రవారం నటుడు సాయాజీ షిండే స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి, నిరసనకారులకు తన మద్దతు తెలిపారు. ఇప్పటికే దాదాపు ఏడు లక్షల మొక్కలు నాటిన సాయాజీ షిండే, ప్రభుత్వ మొక్కల పెంపకం కార్యక్రమాలను గతంలోనూ ప్రశ్నించారు. చెట్లను నరికేస్తున్న ప్రాంతానికి 'తపోవనం' అని పేరు ఉండటం గమనార్హం. ఇలాంటి పవిత్ర ప్రదేశంలోనే చెట్లను కూల్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదంలో నగరపాలక సంస్థ తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సాధుగ్రామ్ నిర్మించ తలపెట్టిన ప్రాంతం 'నో-డెవలప్‌మెంట్ జోన్' పరిధిలోకి వస్తుందని, అభివృద్ధి ప్రణాళికలో మార్పులు చేయకుండానే పనులు చేపట్టారని ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా, నరకడానికి గుర్తించిన చెట్లలో కొన్నింటిని గతంలో నగరపాలక సంస్థే నాటినట్లు నిరసనకారులు ఆధారాలతో సహా బయటపెట్టారు. గంటల వ్యవధిలోనే దాదాపు 3,000 మంది ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాలు చేయడంతో నగరపాలక సంస్థ ఒకింత వెనక్కి తగ్గింది. నరికే చెట్ల సంఖ్యను తగ్గిస్తామని చెబుతున్నా, కొత్త మొక్కలు నాటుతామన్న హామీని పర్యావరణవేత్తలు విశ్వసించడం లేదు. ఈ చెట్లు నగర ప్రజల ఉమ్మడి ఆస్తి అని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వాటిని కాపాడుకోవాలని వారు వాదిస్తున్నారు.

# వెనెజువెలాపై ఏ క్షణంలోనైనా దాడి

**ఎయిర్ స్పేస్ క్లోజ్ అంటూ ట్రంప్ ప్రకటన**



వాషింగ్టన్: వెనెజువెలా గగనతలాన్ని పూర్తిగా మూసివేసినట్లు భావించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో అంతర్జాతీయంగా ఉద్రిక్తత నెలకొంది. అమెరికా ఏ క్షణంలోనైనా వెనెజువెలాపై దాడులు జరిపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. త్వరలో వెనెజువెలా భూభాగంపై ఆపరేషన్లు చేపడతామని ట్రంప్ రెండు రోజుల క్రితమే వెల్లడించారు. తాజాగా ఎయిర్ స్పేస్ క్లోజ్ చేసినట్లు భావించాలని ప్రకటించడంతో ఏ క్షణంలోనైనా దాడులు మొదలు కావొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డ్రగ్ మాఫియాకు వెనెజువెలా స్వర్గధామంగా మారిందని, సముద్ర మార్గంలో అమెరికాలోకి భారీ ఎత్తున డ్రగ్స్ చేరవేస్తున్నారని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ఆరోపించిన విషయం తెలిసిందే. డ్రగ్ మాఫియాను నిర్మూలిస్తామని పలుమార్లు హెచ్చరికలు కూడా ఆయన జారీ చేశారు. ఇప్పటికే కరేబియన్ సముద్రంలో అమెరికా తన యుద్ధ నౌకలను మోహరించింది. దీంతో వెనెజువెలాతో పాటు అమెరికాలోనూ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 'విమానయాన సంస్థలు, పైలట్లు, మానవ అక్రమణదారులు, డ్రగ్ డీలర్లు.. అందరూ జాగ్రత్తగా వినండి. వెనెజువెలా సహా చుట్టుపక్కల ప్రాంతాల్లో గగనతలాన్ని పూర్తిగా మూసివేసినట్లు భావించండి' అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా హెచ్చరికలు జారీ చేశారు.

**వెనెజువెలా రియాక్షన్**

ట్రంప్ ప్రకటనపై వెనెజువెలా తాజాగా స్పందించింది. డ్రగ్ మాఫియాపై పోరాటం పేరుతో అమెరికా హద్దులు దాటుతోందని, తమ సార్వభౌమాధికారాన్ని కించపరుస్తోందని ఓ ప్రకటనలో పేర్కొంది. వెనెజువెలా ప్రభుత్వాన్ని కూల్చేయడమే లక్ష్యంగా ట్రంప్ చర్యలు చేపడుతున్నారని ఆరోపించింది. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో తమ దేశానికి విమాన సర్వీసులను నిలిపివేసిన స్పెయిన్, పోర్చుగల్, కొలంబియా, చిలీ, బ్రెజిల్, తుర్కియే దేశాలపై వెనెజువెలా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయా దేశాలకు చెందిన విమానయాన సంస్థలపై శాశ్వత నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 'స్టేట్ టెర్రరిజం'లో ఈ విమానయాన సంస్థలు కూడా భాగమయ్యాయని మదురో ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.

# యూకేలో భారత విద్యార్థి దారుణ హత్య

లండన్: ఉన్నత చదువుల కోసం యూకే వెళ్లిన హర్యానా యువకుడు అక్కడ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ నెల 25న దుండగులు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. బాధిత కుటుంబం, యూకే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగి. ఉన్నత చదువుల కోసం ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ఏడాది ప్రారంభంలో యూకే వెళ్లాడు. ఈ క్రమంలో ఈ నెల 25న వోర్ స్టర్ లో విజయ్ పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన విజయ్ ను పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ విజయ్ తుదిశ్వాస విడిచాడు. విజయ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన యూకే పోలీసులు.. విజయ్ పై దాడి చేసిన దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. విజయ్ హత్యకు గురయ్యాడని తెలిసి ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. విజయ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావడానికి సహాయం చేయాలని విదేశాంగ శాఖకు, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీలకు కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
సోమవారం 1-12-2025 || www.evarthalu.com || 6

## వయ్యారి చిత్రం



నిక్కీ తంబోలి

## వెంకీ-త్రివిక్రమ్
### బంధు మిత్రుల అభినందనలతో..



త్రివిక్రమ్ శ్రీనివాస్, విక్టరీ వెంకటేష్ కలిసి చేస్తున్న తాజా చిత్రం ప్రస్తుతం మంచి హైప్‌ను పెంచుతోంది. ఈ కాంబినేషన్‌లో మరోసారి సినిమా వస్తుందంటే ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేష్ నటించడం చాలా అరుదైన విషయం కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది. వీరిద్దరి కాంబినేషన్‌పై ఇప్పటి నుంచే భారీ అంచనాలు మొదలయ్యాయి. గతంలో వీరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. ఇక ఇప్పుడు వీరి కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో ఈ మూవీ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. కాగా ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ వార్త వినిపిస్తోంది. ఈ సినిమాకు 'బంధు మిత్రుల అభినందనలతో' అనే టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేయాలని భావిస్తున్నారట. ఈ టైటిల్‌తో ఇదొక పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని తెలుస్తోంది. ఇక ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది.




## అఖండ2కు యూ/ఏ సర్టిఫికెట్

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వస్తున్న 'అఖండ 2: తాండవం' విడుదలకు సర్వం సిద్ధమైంది. డిసెంబర్ 5న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి చివరి అడ్డంకి కూడా తొలగిపోయింది. సినిమాపై ఉన్న అంచనాల నడుమ, తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీ అయ్యింది. చిత్ర యూనిట్ అధికారికంగా ఈ విషయాన్ని పోస్టర్ ద్వారా వెల్లడించింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే ఇందులో యాక్షన్ మోతాదు గట్టిగానే ఉన్నా, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా చూసేలా ఎమోషన్స్ బ్యాలెన్స్ చేశారని అర్థమవుతోంది. సాధారణంగా బోయపాటి సినిమాల్లో వైలెన్స్ కాస్త ఎక్కువగానే ఉంటుంది. అయినా సరే యూ/ఏ వచ్చిందంటే, డివోషనల్ టచ్ సినిమాను సేఫ్ జోన్ లో ఉంచిందని భావించవచ్చు. ఈమధ్య కాలంలో వైలెన్స్ కొంచెం ఎక్కువైనా కూడా ఏ సెన్సార్ రావడం చూస్తున్నాం. కానీ బోయపాటి వైలెన్స్ డోస్ మించకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు అర్థమవుతుంది. అఘోరా గెటప్ లో బాలయ్య విలన్స్ ని ఊచకోత కోసే సీన్స్ ఉన్నా కూడా ఈ తరహాలో సెన్సార్ రావడం ఊహించని ట్విస్ట్.

## వచ్చే ఏడాది క్రిష్ 4 షూటింగ్ స్టార్ట్



భారతదేశపు అతిపెద్ద సూపర్ హీరో ఫ్రాంచైజ్ క్రిష్ 4 కి హృతిక్ రోషన్ దర్శకుడిగా మారబోతున్నాడు. ఈ భారీ ఫ్రాంచైజీలో వచ్చి క్రిష్, క్రిష్2, క్రిష్ 3 చిత్రాలలోనూ హృతిక్ నటించాడు. అయితే, వచ్చే ఏడాది ప్రారంభంలో క్రిష్ 4 షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుందని యష్ రాజ్ ఫిలింస్ తెలిపింది. ఈ భారీ అంచనాల చిత్రానికి నటుడు-దర్శకుడి పాత్రను హృతిక్ పోషిస్తున్నాడని కూడా పేర్కొంది. క్రిష్ 4ని పట్టాలెక్కించక ముందే దాదాపు 28 కోట్ల పెట్టుబడితో హృతిక్ రోషన్ ముంబైలో భారీ ఆఫీస్ స్పేస్‌ను కొనుగోలు చేయడం గమనార్హం.

## నేను దేనికైనా రెడీ: తమన్నా



నిజ జీవిత పాత్రల్లో నటించాలంటే చాలా సవాళ్లను ఎదుర్కోవాలి. నిజ కథలు, నిజ జీవిత పాత్రలకు ప్రత్యేకించి అభిమానులు ఉంటారు. వారిని సంతృప్తి పరిచేలా తారలు నటించి మెప్పించాల్సి ఉంటుంది. దానికోసం చాలా కసరత్తు చేయాలి. అయితే ఇప్పుడు నిజ జీవిత పాత్రలో నటించేందుకు సిద్ధమవుతున్న తమన్నా తాను ఎలాంటి సవాల్ కి అయినా సిద్ధమేనని పేర్కొంది. గల్లీబోయ్ ఫేం సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు అభిజీత్ దేశ్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సినీ నటుడు వి శాంతారామ్ జీవతకథతో ఇది తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి 'చిత్రపతి వి శాంతారామ్' అని పేరు పెట్టారు.

## నయనతార వెరీ బిజీ

లేడీ సూపర్ స్టార్ నయనతార..2026లో వరుస సినిమాలతో అలరించబోతోంది. మనాన్ ఘాటీ సిన్స్ 1960 షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసింది. ప్రస్తుతం ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే ఆ సినిమా రిలీజ్ కానుంది. అలాగే తమిళ్, మలయాళంలో తెరకెక్కిన డియర్ స్టూడెంట్స్ అనే చిత్రం కూడా విడుదలవుతుంది. ఆసినిమా కూడా చిత్రీకరణ ముగించుకుని నిర్మాణానంతర పనుల్లో ఉంది. జనవరిలో సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతున్న మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతోనూ అలరించనుంది. ఇందులో అమ్మడు మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే టాక్సిక్ అనే పాన్ ఇండియా చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. యశ్ హీరోగా నటిస్తోన్న చిత్రమిది. సమ్మర్ కానుకగా చిత్రం రిలీజ్ కానుంది. పేట్రియేట్ అనే మలయాళం చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే తమిళ్ లో మూకుత్తి అమ్మన్ 2 , హాయ్, రఖియే అనే మరో మూడు చిత్రాల్లోనూ నటిస్తోంది. ఈ మూడు షూటింగ్ దశలో ఉన్నాయి. వీటిలో రెండు చిత్రాలు 2026 మిడ్ లో, మరో సినిమా ఏడాది ముగింపులో రిలీజ్ కానున్నాయి. తాజాగా నటసింహ బాలకృష్ణ 111వ చిత్రంలోనూ హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. బాలయ్య తో కలిసి నాల్గవ సారి నటిస్తోంది. మొత్తంగా 2026 లో అమ్మడు తొమ్మిది రిలీజ్ లతో ప్రేక్షకుల్ని అలరించడం ఖాయంగా కనిపిస్తోంది.






## ఉస్తాద్ భగత్ సింగ్‌లో శ్లోకగా రాశి ఖన్నా

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా ఉస్తాద్ భగత్ సింగ్‌కు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో పవన్ మరోసారి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి రాశి ఖన్నా స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. నేడు రాశి ఖన్నా బర్త్‌డే. దాంతో విషెస్ చెబుతూ.. ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో రాశి ఖన్నా శ్లోక రోల్‌లో కనిపించనుంది.

## అయ్యర్‌తో మృణాల్ డేటింగ్?

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, అందాల హీరోయిన్ మృణాల్ ఠాకూర్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని నెలలుగా రూమర్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం మృణాల్ నటుడితో కాదు క్రికెటర్‌తో డేటింగ్‌లో ఉందంటూ కొత్త ప్రచారం మొదలైంది. టీమ్ఇండియా వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, మృణాల్ ఠాకూర్ రహస్యంగా డేటింగ్ చేస్తున్నారని సోషల్ మీడియాలో విపరీతమైన వార్తలు వస్తుండగా, ఇందులో నిజమెంత ఉందనే దానిపై క్లారిటీ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఇటీవలే చిగురించిందని కొన్ని జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. అయితే ఈ ప్రేమ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.





## దండోరా.. పిల్లా సాంగ్ కేక!

నేషనల్ అవార్డు విన్నింగ్ మూవీ కలర్ ఫోటో, బెదురు లంక 2012 వంటి డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలు రూపొందించి లౌక్య ఎంటర్టైన్మెంట్స్ సంస్థ మంచి క్రేజ్ సంపాదించుకున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ లో ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న ఆ బ్యానర్.. ఇప్పుడు క్రేజీ కాన్సెప్ట్ తో దండోరా మూవీ తెరకెక్కిస్తోంది. అగ్రవర్ణాలకు చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా, వారికి ఎదురు తిరిగినా ఎలాంటి ఘటనలు జరుగుతున్నాయనే అంశంతో దండోరా రూపొందుతోంది. తెలంగాణ గ్రామీణ ఆచారాలు- సంప్రదాయాలు, ఎమోషన్లు, కామెడీల మేళవింపుతో తెరకెక్కుతోంది. డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ కానుకగా సినిమా రిలీజ్ కానుంది.

ఈవార్తలు
# క్రీడావాణి SPORTS
సోమవారం 1-12-2025
www.evarthalu.com





## రో'హిట్'.. 352 సిక్సులు

దక్షిణాఫ్రికాతో రాంచీలో జరుగుతున్న వన్డే మ్యాచ్‌లో టీమిండియా దిగ్గజం రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఈ ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ కేవలం 3 సిక్సర్లు కొట్టడం ద్వారా పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది పేరిట ఉన్న అత్యధిక సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టాడు. రోహిత్ శర్మ ఇప్పుడు వన్డే ఫార్మాట్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌లో ఇప్పుడు 352 సిక్సర్లు కొట్టాడు. షాహిది అఫ్రిది తన కెరీర్లో351 సిక్సర్లు బాదాడు. రోహిత్ శర్మ ఈ ఘనతను తన 269వ వన్డే ఇన్నింగ్స్‌లో సాధించగా.. షాహిద్ అఫ్రిది 369 వన్డే ఇన్నింగ్స్‌లలో 351 సిక్సర్లు కొట్టాడు. రోహిత్ శర్మ అఫ్రిది కంటే 100 ఇన్నింగ్స్ తక్కువగానే ఈ రికార్డును బద్దలు కొట్టడం విశేషం. ఈ క్రమంలో రోహిత్ శర్మ వన్డే క్రికెట్లో తన 60 అర్ధ సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. రోహిత్ శర్మ 43 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. అయితే అర్ధ సెంచరీ చేసిన తర్వాత రోహిత్ శర్మ తన ఇన్నింగ్స్‌ను ఎక్కువగా కొనసాగించలేకపోయాడు. మార్కో యాన్సెన్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు.

# రో-కో తుక్కుతుక్కు..!

### రోహిత్, కోహ్లీ భారీ ఇన్నింగ్స్.. రికార్డులు తిరగరాసిన కోహ్లీ

### ఉత్కంఠభరిత పోరులో భారత్ విజయం.. బౌలింగ్‌లో మెరిసిన కుల్దీప్

**మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా రాంచీలో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా దక్షిణాఫ్రికా జట్టుపై ఉత్కంఠ భరితంగా పోరాడి విజయం సాధించింది. ఈ విజయంతో టీమిండియా ఈ సిరీస్ లో 1-0 ఆధిక్యాన్ని సాధించింది. మ్యాచ్‌లో భారత్ మొదట బ్యాటింగ్ చేసి విరాట్ కోహ్లీ సెంచరీ దెబ్బకు 349 పరుగుల భారీ స్కోరు సాధించగా.. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు 332 పరుగులకే పరిమితమైంది. ఈ క్రమంలో భారత్ 17 రన్స్ తేడాతో విజయం సాధించింది.**



రాంచీ: ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (135 పరుగులు) తన 52వ వన్డే శతకంతో భారీ స్కోరు అందించాడు. కోహ్లీ తన 120 బంతుల మెరుపు ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 7 సిక్సర్లు కొట్టి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. క్రికెట్‌లోని ఈ ఏకైక ఫార్మాట్‌లో తన విలువ, ఆధిపత్యాన్ని కోహ్లీ మరోసారి నిరూపించాడు.కోహ్లీ, ఓపెనర్ రోహిత్ శర్మ (51 బంతుల్లో 57) తో కలిసి రెండో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారీ స్కోరుకు పునాది వేశారు. కోహ్లీ టీ20 అంతర్జాతీయ ఫార్మాట్‌లో భాగం కాకపోవడం, భారత్‌కు రాబోయే 8 నెలల్లో కేవలం ఆరు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఉండటంతో, 36 ఏళ్ల కోహ్లీకి ఈ ఫార్మాట్‌లోని ప్రతి మ్యాచ్ ఎంతో ముఖ్యం. తన ప్రదర్శన ద్వారా అతను ఈ ఫార్మాట్‌లో అత్యంత నమ్మదగిన బ్యాటర్‌గా ఉన్నానని సెలెక్టర్లకు, టీమ్ మేనేజ్‌మెంట్‌కు గుర్తుచేశాడు.

**రో-కో జోడీ అదరహో..**

క్రికెట్ ప్రేమికులు ఎప్పటి నుంచో కోహ్లీ, రోహిత్ నుండి పెద్ద ఇన్నింగ్స్‌లు ఆశించారు. ఈ మ్యాచ్‌లో వారిద్దరి మధ్య ఏర్పడిన 136 పరుగుల భాగస్వామ్యం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాక, వారు ఇప్పటికీ పెద్ద వేదికలపై స్టార్స్‌గా రాణించగలరని టీమ్ మేనేజ్‌మెంట్‌కు భరోసా ఇచ్చింది. రోహిత్ శర్మ కేవలం ఒక పరుగు వద్ద లభించిన లైఫ్‌ను సద్వినియోగం చేసుకుని, మార్కో యాన్సెన్ చేతిలో ఎల్బీడబ్ల్యూగా ఔట్ అయ్యే ముందు అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. యశస్వి జైస్వాల్ (18) వికెట్ త్వరగా పడిపోయిన తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లీ.. బర్గర్ బౌలింగ్‌లో మిడ్-ఆఫ్ మీదుగా సిక్సర్ కొట్టి తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. కోహ్లీ ఒక అద్భుతమైన కవర్ డ్రైవ్ కూడా ఆడాడు. బాష్ బౌలింగ్‌లో సిక్సర్ కొట్టి కోహ్లీ తన అర్ధ సెంచరీని పూర్తి చేయగా, రోహిత్ ఒక సింగిల్ తీసి ఫిఫ్టీ మార్కును దాటాడు. దీంతో భారత్ త్వరగా 100 పరుగుల మార్కును దాటింది. రుతురాజ్ గైక్వాడ్ (8, వాషింగ్టన్ సుందర్ త్వరగా ఔట్ అయినప్పటికీ కోహ్లీ క్రీజులో నిలదొక్కుకున్నాడు. కోహ్లీ సెంచరీ పూర్తి చేసిన వెంటనే, ఒక అభిమాని భద్రతా వలయాన్ని ఛేదించుకుని వచ్చి మోకాలిపై కూర్చుని అతని పాదాలను తాకాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (60 పరుగులు) స్పిన్నర్ ప్రేన్లన్ సుబ్రయన్ బౌలింగ్‌లో ఇబ్బంది పడుతున్నా, ఆఖర్లో వేగంగా ఆడి స్కోరును పెంచాడు. కోహ్లీ కూడా సుబ్రయన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు , ఒక ఫోర్‌తో 21 పరుగులు రాబట్టాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో యాన్సెన్, నాంద్రే బర్గర్, కార్బిన్ బాష్, ఒట్నీల్ బార్ట్‌మాన్ తలో రెండు వికెట్లు తీశారు.



### బౌలింగ్‌లో కుల్దీప్ మ్యాజిక్


భారత్ 349 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా, దక్షిణాఫ్రికా కూడా దీటుగా బదులిచ్చింది. అయితే, తుది దశలో భారత్ బౌలర్లు, ముఖ్యంగా యువ పేసర్ హర్షిత్ రాణా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మాయాజాలం ప్రదర్శించారు. కీలక సమయాల్లో వికెట్లు తీయడం, పరుగులను కట్టడి చేయడం ద్వారా దక్షిణాఫ్రికాను 332 పరుగులకే పరిమితం చేశారు. దీంతో టీమిండియా 17 పరుగుల స్వల్ప తేడాతో విజయాన్ని అందుకుంది.

## రికార్డులే చిన్నబోగా..!

రాంచీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో భారత సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ తన 52వ వన్డే సెంచరీతో అద్భుత రికార్డులు సృష్టించాడు. ఈ ఒక్క ఇన్నింగ్స్‌లోనే కోహ్లీ సచిన్ టెండూల్కర్‌కు చెందిన పలు చారిత్రక రికార్డులను బ్రేక్ చేశాడు. ఫిబ్రవరి 2025 తర్వాత స్వదేశంలో ఆడిన తొలి ఇన్నింగ్స్‌లోనే మెరుపులు మెరిపించాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో.. ఒక అంతర్జాతీయ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచాడు. తన 52వ వన్డే సెంచరీతో అతను టెస్టుల్లో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 51 సెంచరీల రికార్డును అధిగమించాడు. ఇది క్రికెట్ చరిత్రలో ఒక బ్యాటర్ ఒకే ఫార్మాట్‌లో సాధించిన అత్యధిక శతకాలుగా రికార్డుకెక్కింది. అంతేకాకుండా వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు (49) చేసిన రికార్డును 2023 ప్రపంచకప్‌లోనే అధిగమించిన కోహ్లీ, ఈ ఫార్మాట్‌లో తన సెంచరీల సంఖ్యను ఇప్పుడు 52కు పెంచుకుని తన రికార్డును మరింత పటిష్ఠం చేసుకున్నాడు. ఈ సెంచరీతో అతను స్వదేశంలో వన్డేలలో 25 సెంచరీలు సాధించిన మొదటి ఆటగాడిగా నిలిచాడు. అలాగే దక్షిణాఫ్రికాపై వన్డేలలో అత్యధిక సెంచరీలు సాధించిన రికార్డును కూడా కోహ్లీ సొంతం చేసుకున్నాడు. కేవలం 30 ఇన్నింగ్స్‌లలో 6 సెంచరీలు సాధించి, 57 ఇన్నింగ్స్‌లలో 5 సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్ రికార్డును అతను బద్దలు కొట్టాడు. ఇక, అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌లలో నంబర్ 3 స్థానంలో ఆడుతూ 218 సిక్సర్లు కొట్టాడు. దీనితో ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ (217 సిక్సర్లు) రికార్డును అధిగమించాడు.

## మళ్లీ టెస్టుల్లోకి కోహ్లీ.. బీసీసీఐ క్లారిటీ!

స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌ను అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. సీనియర్ల రిటైర్మెంట్‌తో వారి స్థానాన్ని భర్తీ చేయగల క్రికెటర్లు కరువవ్వడంతో టీమిండియా చావుదెబ్బ తిన్నదనేది కాదనలేని వాస్తవం. కుర్రాళ్ల నిలకడలేమి, కోచ్ గంభీర్ ప్రయోగాలు బెడిసికొట్టడంతో భారత జట్టు డబ్ల్యూటీసీలో ఐదో ర్యాంక్‌కు పడిపోయింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ పూర్వవైభవం రావాలంటే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మను వీడ్కోలు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాంచీ వన్డేలో కోహ్లీ సెంచరీతో చెలరేగిన వేళ.. అతడిని మళ్లీ టెస్టులు ఆడేందుకు ఒప్పించేందుకు బీసీసీఐ సిద్ధమవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, సెక్రటరీ దేవజిత్ సైకియా అవన్నీ వదంతులే అని కొట్టిపారేశాడు. 'టెస్టుల్లో విరాట్ పునరాగమనం గురించి మీరు వింటున్న వార్తలన్నీ అవాస్తవాలే. ఈ విషయం గురించి విరాట్‌తో మేము ఎలాంటి చర్చలు జరపలేదు. గాలి వార్తలకు ప్రాధాన్యం ఇవ్వకండి. కోహ్లీ, మా మధ్య చర్చలు జరుగలేదు' అని తెలిపాడు. అయితే.. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ మాత్రం విరాట్, రోహిత్ యూటర్న్‌కు సిద్ధంగా ఉంటే తీసుకోవడం మంచిదని అంటున్నాడు. ప్రస్తుతం సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమిండియా పుంజుకోవాలంటే వీరిద్దరిని తీరిగి తీసుకోవాలని పీటర్సన్ పేర్కొన్నాడు.




## ఐపీఎల్‌కు రస్సెల్ గుడ్‌బై

కోల్‌కతా నైట్ రైడర్స్ దిగ్గజం, రెండు సార్లు ఐపీఎల్ ఛాంపియన్ ఆండ్రీ రస్సెల్ ఈ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. కేకేఆర్ అతడిని రిలీజ్ చేసిన తర్వాత ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే ఐపీఎల్ 2026లో ఆండ్రీ రస్సెల్ కోల్‌కతా నైట్ రైడర్స్ సపోర్ట్ స్టాఫ్‌లో పవర కోచ్‌గా చేరనున్నాడు. ఆండ్రీ రస్సెల్ దశాబ్దానికి పైగా కేకేఆర్‌తో అనుబంధం కలిగి ఉన్నాడు. 2014, 2024లో ఛాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా నైటర్ రైడర్స్ జట్టులో ఆండ్రీ రస్సెల్ కీలక సభ్యుడు. ఆండ్రీ రస్సెల్ అకస్మాత్తుగా ఇంత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో ఓ భావోద్వేగ పోస్ట్ ద్వారా అభిమానులకు వివరించాడు. 'నేను ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు, ఇది సరైన సమయం అని భావించాను. నేను నా వెనుక ఒక గొప్ప లెగసీని వదిలి వెళ్లాలనుకుంటున్నాను' అని రస్సెల్ పేర్కొన్నాడు. రస్సెల్ రిటైర్‌మెంట్ ప్రకటించినప్పటికీ కేకేఆర్‌తో తన అనుబంధాన్ని కొనసాగిస్తాడు. వచ్చే సీజన్‌లో కేకేఆర్ పవర్ కోచ్ పాత్రలో ఉంటానని అభిమానులకు శుభవార్త అందించాడు.

## 32 బంతుల్లోనే సెంచరీ

**సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అభిషేక్ శర్మ విధ్వంసం**

**12 బంతుల్లో హాఫ్ సెంచరీతో యువరాజ్ రికార్డు సమం**

దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు ముందు టీమ్ఇండియా యువ ఆటగాడు అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌ను ప్రదర్శించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా హైదరాబాద్ వేదికగా బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో పరుగుల సునామీ సృష్టించాడు. కేవలం 32 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, టీ20 ఫార్మాట్‌లో తనదైన ముద్ర వేశాడు. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన అభిషేక్... 52 బంతుల్లో 16 సిక్సర్లు, 8 ఫోర్ల సాయంతో 148 పరుగులు చేసి ఔరా అనిపించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ జట్టుకు అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 12 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, తన మెంటార్ యువరాజ్ సింగ్ రికార్డును సమం చేశాడు. 2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌పై యువరాజ్ సరిగ్గా 12 బంతుల్లోనే అర్ధ శతకం సాధించిన విషయం తెలిసిందే. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (35 బంతుల్లో 70) కూడా రాణించడంతో, వీరిద్దరూ




తొలి వికెట్‌కు 205 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. అభిషేక్ విధ్వంసానికి తోడు రమణ్‌దీప్ సింగ్ (15 బంతుల్లో 39), సన్వీర్ సింగ్ (8 బంతుల్లో 22) చివరిలో మెరుపులు మెరిపించడంతో పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇది సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు కాగా, ఓవరాల్‌గా టీ20 క్రికెట్‌లో నాలుగో అత్యధిక స్కోరు. బెంగాల్ బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా, మహ్మద్ షమీ, ప్రదీప్త, సాక్షైమ్ తలో వికెట్ పడగొట్టారు.

## కామన్వెల్త్ గేమ్స్‌కు 5 వేల కోట్లు!?

2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ క్రీడలను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ సర్వసభ్య సమావేశంలో ఈమేరకు తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో క్రీడల నిర్వహణ కోసం త్వరలో ఓ ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. రూ.3,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల వ్యయంతో ఈ గేమ్స్‌ను నిర్వహించాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. మొత్తం ఖర్చు ఖరారు విషయంలో ఇంకా అంచనాలు రూపొందుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గతంలో 2010లో న్యూఢిల్లీలో కామన్వెల్త్ క్రీడలు నిర్వహించారు. ఇది అనేక వివాదాల్లో చిక్కుకుంది. మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం, అవినీతి ఆరోపణలు, ప్రాథమిక అంచనాల కన్నా చాలా ఎక్కువ ఖర్చు కావడం వంటివి జరిగాయి. ఈ క్రీడల నిర్వహణకు రూ.635 కోట్లు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
సోమవారం 1-12-2025 | www.evarthalu.com



రామాయణం ప్రధాన లక్ష్యం రావణ వధ.. ఇది ఎలా జరిగింది? పురాణాల కథనాల ప్రకారం విష్ణుమూర్తి అప్పటికే ఆరు అవతారాలు ధరించాడు. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరుశురామ అవతారాలన్నీ క్షణాల్లో ముగిసిపోయినా.. శత్రువును నిర్నిరోధంగా హతమార్చినవే ఈ అవతారాలన్నీ. ఒక్క పరుశు రాముడి అవతారం ముగించటానికి కొంత టైం పట్టిందేమో కానీ, ఏ అసురుడిని శిక్షించటానికైతే అవతారాన్ని ధరించాడో.. వచ్చిన పనిని సెకన్ల వ్యవధిలో కానిచ్చేసుకుని చక్కా వైకుంఠానికి వెళ్లిపోయాడు. తనను ఎదిరించే కనీస గడువు కూడా శత్రువుకు ఇవ్వకుండా అంతం చేసిన అవతారమూర్తి, రాముడుగా ఆవిర్భవించిన తరువాత ఆ నారాయణుడు దైవత్వాన్ని ఎందుకు ప్రదర్శించలేదు? రావణుణ్ణి తన దివ్యశక్తితో ఎందుకు సంహరించలేదు? దైవశక్తుల్ని ప్రయోగించనప్పుడు.. రావణుణ్ణి ఎలా చంపగలిగాడు?

# రాముడు ఎలా గెలిచాడు?

లంక ఓ మహా సామ్రాజ్యం.. బలవంతుడైన రాజు.. అత్యాధునిక ఆయుధ సంపత్తి.. సూపర్ సోనిక్ వెపన్స్.. సుశిక్షితమైన సేనావాహిని, చతురంగబలాలు.. ఒక్కొక్కరు వంద మందినైనా చంపగల యోధులు ఉన్న రావణుడు ఎదురులేని వాడు.. ముల్లోకాలను జయించిన వాడు.. నేలపై ఉండి యుద్ధం చేయగలడు.. ఏరియల్ అటాక్స్ చేయగలడు.. మిస్సైల్ టెక్నాలజీ తెలిసిన వాడు.. అలాంటి యోధుణ్ణి జయించటం ఎవరికైనా ఎలా సాధ్యం? ఈయనేమో పధ్నాలుగేళ్లు అడవుల్లో గడిపి వచ్చాడు. నారచీరలు.. కందమూలాల ఆహారం.. చేతిలో కోదండం.. అమ్ములపొదిలో బాణాలు.. వెన్నంటి ఉన్న అడవిలో తిరిగే వానరాలు.. రాళ్లూ రప్పలు విసరడం తప్ప కోతులకు యుద్ధ నైపుణ్యం ఎక్కడిది.. ఇద్దరు అన్నదమ్ముల దగ్గర ధనుర్బాణాలు తప్ప మరేవీ లేవాయె.. కనీసం రథం కూడా లేదు.. వెంట ఉన్న సైన్యమేమో.. అడవుల్లో తిరిగే కోతులు.. ఎలుగుబంట్ల జాతుల వారు.. వీరితో పాటు ఉత్తర భారతం నుంచి దక్షిణాపథం వరకూ వెంట వచ్చిన జనసమూహం ఉంది. సంఖ్య ఎక్కువే అయినా.. రావణుడి రణనీతి ముందు వీరంతా బలాదూరే. కోతి బుద్ధులు కోటి.. ఇలాంటి వాళ్లను వెంటేసుకొని వెళ్లిన రాముడు రావణాసురుని గెలవటం ఎలా సాధ్యమైంది? కేవలం దేవుడు కాబట్టే అలా జరిగిందా? కేవలం రాముడి దగ్గరే అంతులేని శక్తి ఉందా? లేక మరేదైనా కారణం ఉందా? రామావతారంలో ఎక్కడా దైవశక్తి ప్రదర్శన కొంచెం కూడా కనిపించదు. అలాంటప్పు డు రాముడి శక్తిసామర్థ్యాలు ఏపాటివి? ఆయన బలాబలాలు.. యుద్ధ వ్యూహాలు ఏమిటి? పోనీ అయోధ్యలో ఉన్నాడంటే.. అక్కడి సైన్యం తోడైనా ఉండేది.. కానీ, రాముడికి ఉన్న యుద్ధనీతి ఏమిటి?

రావణుడి కడుపులో అమృతం ఉందని విభీషణుడు చెప్పటం.. లేదు లేదు.. ధర్మానికి విరుద్ధంగా.. నేను కడుపుపై బాణం వేయనని రాముడు అనటం.. హనుమంతుడు గాలిని ప్రార్థించటం.. బాణం కాస్తా దారి మళ్లి కడుపులో గుచ్చుకోవటం ఇదంతా రామాయణ యుద్ధంలో వాస్తవంగా జరిగిందా? అసలు ఓ వ్యక్తి కడుపులో అమృతం ఉన్న కుండను దాచుకోవటం సాధ్యమయ్యేపనేనా? ఒకవేళ రావణుడి కడుపులో అమృతభాండం ఉందని కాసేపు అనుకుందాం. దేవతలకు అమృతం దొరికిన తరువాత వాళ్లు దాన్ని తాగి.. తమ రక్తంలో కలిపేసుకుని చిరంజీవు లయ్యారు. అంతే కానీ, గిన్నెల్లోనో.. కుండల్లోనో నింపుకుని కడుపుల్లో దాచుకోలేదు. అమృతం తాగితే చిరంజీవులు అవుతారు కానీ, సీల్ చేసి కడుపులో పెట్టుకుంటే ఎలా చిరంజీవి అవుతారు? అలాంటప్పుడు రాముడు కడుపులోకి బాణం కొట్టి అమృతభాండాన్ని బద్దలు చేయటం ఏమిటి? దీని వెనుక ఉన్న లాజిక్ ఏమిటి? రామాయణంలో ఒకటి రెండు సందర్భాల్లో తప్ప ఆయన విష్ణువుగా.. అవతార పురుషుడిగా మనకు కనిపించడు. ఒక మనిషి తానుగా ఎలా ఎదగాలి.. శక్తి సామర్థ్యాలు ఎలా సంపాదించుకోవాలి? విజేతగా ఎలా నిలవాలి? అన్నవాటిని అక్షరాలా తాను చేసి చూపించినవాడు శ్రీరామచంద్రుడు. నేను మనిషిని.. మనిషి ధర్మమే నాది.. ఈ భూమ్మీద ఎలాంటి అధర్మపు నీడను కూడా నేను సహించను అని అరణ్యకాండలో రాముడు విస్పష్టంగా చెప్పాడు. కాబట్టి శ్రీరామ చంద్రుడు అవతారపురుషుడే అయినా ఖచ్చితంగా సాధారణ మనిషి లాగానే తానూ ప్రవర్తించాడు. ఆయన ఒక రాజుగా తాను చేయవలసిందంతా చేశాడు. ధర్మాన్ని అతిక్రమించిన వాళ్లు ఎంతటి వారైనా శిక్షించాడు. యుద్ధ రంగంలో అలా వెళ్లి ఏవో దివ్యశక్తులతో రావణుణ్ణి దండించలేదు. చిన్నప్పటి నుంచీ రాముడు ఒక లక్ష్యంతో పెరిగాడు. అన్ని విద్యలూ నేర్చుకున్నాడు. ఏ ఆయుధాన్ని, ఏ అస్త్రాన్ని ఎలా ప్రయోగించాలో పూర్తి నైపుణ్యంతో నేర్చుకున్నాడు. చిన్నతనంలో గురువు దగ్గర విద్యాభ్యాసానికి వెళ్లటానికి ముందే ధనుర్విద్య ప్రారంభించాడు. భారత కాలం నాటికి చాలా ఆయుధాలు రంగంలోకి వచ్చాయి కానీ, త్రేతాయుగంలో మాత్రం విల్లే ప్రధాన ఆయుధం.. ఇందజిత్తు, రావణుడు, రాముడు, లక్ష్మణుడు అంతా విల్లుతో యుద్ధం చేసిన వాళ్లే.

రాముడికి ధనుర్విద్యలో ఓనమాలు నేర్పింది ఎవరో తెలుసా? ఎవరైతే ఆయన్ను అడవులకు పంపాలని భర్తను డిమాండ్ చేసిందో ఆమే.. కైకేయి. మొదట్నుంచీ ఆమె టార్గెట్ రాముణ్ణి రావణాంతకుడిగా తయారుచేసి పంపిచాలన్నదే.. అందుకోసమే మొదట్నుంచీ రాముణ్ణి పెంచి పెద్ద చేసింది కైకేయే. ధనుర్విద్యను రాముడు మొదట ఆమె దగ్గరే నేర్చుకున్నాడు. ఆ తరువాత విశ్వామిత్రుడితో యాగరక్షణ పేరుతో అడవికి వెళ్లి ఆయన దగ్గర అనేక అస్త్రాలను ప్రయోగించటం, ఉపసంహరించటం నేర్చుకున్నాడు. ఆనాటి కాలంలో అతి ముఖ్యమైన బల అతిబల విద్యలను కూడ విశ్వామిత్రుడి దగ్గరే రాముడు నేర్చుకున్నాడు. రాముడు అడవికి వెళ్లే నాటికే పూర్తిస్థాయిలో యుద్ధవిద్యల్లో ఆరితేరినవాడు. అడవుల్లో పధ్నాలుగేళ్లు వనవాస జీవితం గడిపినా.. సాధువులా ఉండలేదు. దండకారణ్యానికి రావణుడి ప్రతినిధిగా, మన పరిభాషలో గవర్నర్లుగా వ్యవహరిస్తున్న ఖరదూషణులను.. వారి దగ్గరున్న 14వేల మంది సైన్యాన్ని అంతం చేశాడు. శూర్పణకను ఆయన తమ్ముడు పరాభవించి పంపాడు. ఒక్కమాటలో చెప్పాలంటే మొదట్నుంచీ మనం ఏ విద్యనైనా ఎలా నేర్చుకుంటామో.. రాముడూ అలాగే నేర్చుకున్నాడు. మహారాక్షస సంహారానికి వ్యూహాత్మకమైన రణతంత్ర ప్రయోగాన్ని చేశాడు. తాను అడవికి వెళ్లింది రావణ సంహారానికని రాముడికి స్పష్టంగా తెలుసు.. మొదట మారీచ సుబాహుల ద్వారా తాను వచ్చానన్న సంకేతాన్ని రావణుడికి పంపించాడు. ఆ తరువాత ఖరదూషణులను చంపటంతో అతణ్ణి కవ్వించినట్లయింది. శూర్పణక పరాభవంతో రావణుడు పూర్తిగా రాముడి ఎత్తుగడకు పడిపోయాడు.. పరుగులు పెడుతూ దండకారణ్యానికి వచ్చి చేయరాని తప్పిదాన్ని, సీతాపహరణం రూపంలో చేసేశాడు. రాముడు లంకలో ప్రవేశించటానికి ముందే చాలా పక్కాగా ప్లాన్ చేసుకున్నాడు. సీతాదేవిని ఏ వైపు రావణుడు తీసుకెళ్లాడో జటాయువు ముందే చెప్పాడు. అందుకే హనుమంతుడిని అటువైపు పంపించాడు. అతను లంకకు వెళ్లి సీతమ్మ జాడను తెలుసుకోవడం కంటే చాలా పెద్దపనే చేశాడు. దీంతో రాముడి గెలుపు చాలా సులువైంది.

ఆంజనేయుణ్ణి లంకకు పంపించటం వెనుక రాముడి రణతంత్రాన్ని రావణుడు ఊహించలేకపోయాడు. హనుమంతుడు.. సీత జాడతో పాటు రావణుడి వ్యూహాత్మక యుద్ధ స్థావరాలను ధ్వంసం చేశాడు. అతడి కుమారుల్లో



ఒకడైన అక్షయుణ్ణి హతమార్చాడు. వైమానిక దాడుల కోసం రావణుడు ఉపయోగించే విమానాశ్రయాలను ధ్వంసం చేశాడు. ఆయుధాగారాలను దగ్ధం చేశాడు. వానరులు.. గోలాంగూలాలు.. భల్లూకులు రాముడి సేనావాహినిలో మూడు ప్రధాన విభాగాలుగా ఉన్నాయి. లంకకు చేరుకున్న తరువాత మూడు వైపుల మూడు దళాలను మోహరించాడు. అదే సమయంలో అన్నతో గొడవపడి వచ్చిన విభీషణుణ్ణి తన శిబిరంలోకి చేర్చుకోవటం యుద్ధనీతిలో భాగమే. శత్రువు బలాలు.. బలహీనతల గురించి తెలుసుకుని దానికి తగ్గట్టుగా యుద్ధవ్యూహం పన్నటానికి ఇతను ఆసాంతం రాముడికి ఉపయోగపడ్డాడు. అదే సమయంలో రావణుడు కూడా తన నిఘా వర్గాలను అలర్ట్ చేశాడు. ఇద్దరు సీక్రెట్ ఏజెంట్లు రాముడి వెంట ఉన్న సైన్యం వివరాలను, శక్తి సామర్థ్యాలను రావణుడికి వివరించారు. రావణుడు తన దగ్గరున్న దుర్భిణి(మైక్రోస్కోప్) ద్వారా రాముడి సైన్యాన్ని చూసి ఓ అంచనాకు వచ్చాడు. దాదాపు 18 మంది సేనా నాయకులు రావణుడి సైన్యాన్ని పటిష్ఠంగా నడిపిస్తున్నారు. ప్రహస్తుడు.. ఇంద్రజిత్తు, నికుంభుడు, విరూపాక్షుడు లాంటి వారుండగా.. తానూ, కుంభకర్ణుడూ యుద్ధానికి వెళ్లాల్సిన అవసరం రానే రాదనుకున్నాడు రావణుడు. విరూపాక్షుణ్ణి నగరం మధ్యలో ఉంచి.. మిగతా వీరులను లంకానగరానికి నాలుగు ద్వారాల దగ్గరా మోహరించాడు. అదే విధంగా రాముడు కూడా తన వీరులను నాలుగువైపులా పంపాడు. ఓ వైపు లంకపై వానరసేన ముప్పేటదాడికి పూనుకుంది. మరోవైపు ఇంద్రజిత్తు రామలక్ష్మణులపై నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. దాంతో ఇద్దరూ మూర్ఛపోయారు. గరుత్మంతుడు వచ్చి వాళ్లను విడిపించాల్సి వచ్చింది. ప్రహస్తుని నీలుడు హతమార్చాడు. ఇంద్రజిత్తును హతమార్చటానికి లక్ష్మణుడు చాలా కష్టపడాల్సి వచ్చింది. చివరకు ఒకరాత్రి మూర్ఛపోయిన లక్ష్మణుణ్ణి అంజనేయుడు తెచ్చిన సంజీవనీ మూలికలతో సుశేనుడు బతికించాడు. చివరకు రావణుడు రంగంలోకి ప్రవేశించక తప్పలేదు. రావణుడి భీకర యుద్ధానికి సుగ్రీవుడు మూర్ఛపోయాడు. అతని పిడికిలి దెబ్బకు హనుమంతుడు కంపించిపోయాడు. రావణుడు విసిరిన శక్తికి లక్ష్మణుడు సొమ్మసిల్లి పడిపోయాడు.. ఆ తరువాత హనుమంతుడు రాముడిని తన భుజాలపై ఎక్కించుకుని అసురుడిపైకి ఉరుకురికి వెళ్లాడు. రాముడి బాణాలకు రావణుడి రథం, గుర్రాలు.. ధ్వంసం అయ్యాయి. మర్నాడు కుంభకర్ణుడు సీన్లోకి వచ్చాడు. ఇతని దెబ్బకు హనుమంతుడు రక్తం కక్కుకున్నాడు. మిగతా వానరవీరులు వాడి విదిలింపులకే మూర్ఛపోయారు. ఆ తరువాత రాముడు రెండు గొప్ప అస్త్రాలను ప్రయోగించి అతణ్ణి హతమార్చాడు.

మూడో రోజున తిరిగి రావణుడితో భీకరమైన యుద్ధం జరిగింది. రామరావణుల శరీరాలు రక్తసిక్తమయ్యాయి. రావణుడితో సమానంగా పోరాడటం కోసం ఇంద్రుడు తన రథాన్ని పంపించాడు. రావణుడి తలల్ని నూటొక్క సార్లు తెగనరికినా అవి తిరిగి మొలుస్తూనే ఉన్నాయి. చివరకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ బ్రహ్మాస్త్రం రావణుడి గుండెను చీల్చేసింది. అలా రాముడు రావణుణ్ణి హతమార్చాడు. రావణ వధ అంతా చెప్పుకుం టున్నట్టు విజయదశమి నాడు జరగలేదు. యుద్ధకాండ (92/64)లో చెప్పినట్టు అమావాస్య రోజున చోటు చేసుకుంది. రావణుడిని వధించిన సమయంలో రాముడు జయ నినాదం చేశాడు. ఓ చేత్తో ధనస్సును.. మరో చేత్తో బాణాణ్ణి పట్టి తిప్పుతూ రక్తంతో ఎరుపెక్కిన శరీరంలో నిలుచున్నాడు. రాముడు దేవుడిలా కంటే మామూలు మనిషిలాగానే వీరోచితంగా పోరాడాడు.. యుద్ధంలో ఆయన శరీరం కూడా గాయపడింది.. నువ్వానేనా అన్న స్థాయిలో యుద్ధం చేశాకే రాముడు గెలిచాడు. అంతే కానీ.. ఏదో దివ్యశక్తులతో ఓ సుదర్శన చక్రాన్ని సింపుల్గా ప్రయోగించి రావణుణ్ణి చంపలేదు. తాను ఒక మనిషిగా.. మనిషి జీవితంలో విశ్వవిజేతగా నిలవాలంటే ఏ విధంగా ఉండాలో.. ఏం చేయాలో రాముడు అది చేసి చూపించాడు. మనిషిలో ఉండాల్సిన అన్ని కోణాలను రాముడు చూపించగలిగాడు. కాబట్టే ఆయన లోకనాయకుడయ్యాడు.



కోవెల సంతోష్ కుమార్
రచయిత
9052116463

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY BOMMAKANTI SHRAVAN KUMAR, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: BOMMAKANTI SHRAVAN KUMAR, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.